
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY

5 జయశంకర్ భూపాలపల్లి

శుక్రవారం 21 ఫిబ్రవరి 2025

అభయారణ్యంలో టోల్‌గేట్

- పర్యావరణ రుసుం వసూలుకు ఫాస్టాగ్
- ములుగు జిల్లాలో అటవీ శాఖ వినూత్న ప్రయోగం
- వాహనదారులకు షాక్

వివారాలు 8లో...



రాయితీతోనైనా.. మోక్షం లభించేనా?

ఎల్ఆర్ఎస్ దరఖాస్తులకు రాష్ట్ర ప్రభుత్వం మరోసారి పచ్చజెండా

- 25 శాతం రాయితీ నిర్ణయంతో దరఖాస్తుదారులకు ఊరట
- అధిక సంఖ్యలో ముందుకు వచ్చే అవకాశం
- మున్సిపాలిటీలకు భారీగా సమకూరనున్న ఆదాయం
- ఉమ్మడి వరంగల్ జిల్లాలో 1.41లక్షల అప్లికేషన్లు
- ఐదేళ్లుగా పెండింగ్‌లో.. మళ్లీ కదలికతో చిగురిస్తున్న ఆశలు

హనుమకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యులేషన్ స్కీమ్) మళ్లీ తెరపైకి వచ్చింది. ఐదేళ్లుగా నానుతున్న ఈ పథకం.. కనీసం ఈ సారైనా పూర్తిస్థాయిలో అమలవుతుందా? రెగ్యులరైజేషన్ కోసం దాఖలైన దరఖాస్తులకు ఫీజు చెల్లింపులో ప్రభుత్వం 25శాతం రాయితీ ఇస్తూ ప్రభుత్వం చేసిన ప్రకటనతోనైనా మోక్షం లభిస్తుందా? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. తొలి నుంచి ఎల్ఆర్ఎస్ అమలు ప్రక్రియ అనేక ఒడుదుడుకుల మధ్య నత్తనడకన సాగుతోంది. ఈ పథకం అమలు విషయంలో ప్రభుత్వాలకు స్పష్టత లేకపోవడం, నిబంధనలను ఎప్పటికప్పుడు మార్చుతుండడం, శాఖల మధ్య సమన్వయ లోపం, దరఖాస్తుదారుల్లో ఉదాసీనత వెరసి.. ఎల్ఆర్ఎస్ అమలు ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఒక ప్రహసంగా మారిపోయింది. గత బీఆర్ఎస్ సర్కార్, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం నాలుగైదుసార్లు ప్రకటనలు చేసినా అనుమతి లేని ప్లాట్లు, లే అవుట్‌ల క్రమబద్ధీకరణ ఆశించిన స్థాయిలో జరగలేదు.

బృందాలు ఏమైనట్టు?

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారానికి ప్రతీ జిల్లాకు ఒక ప్రత్యేక బృందాన్ని నియమించనున్నట్లు కిందటేడు జూలై నెలలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. మున్సిపాలిటీ, రెవెన్యూ, నీటిపారుదలశాఖ, పంచాయతీరాజ్ శాఖలకు చెందిన అధికారులతో ఈ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్టు తెలిపింది. బృందాలు క్షేత్రస్థాయిలో దరఖాస్తులను పరిశీలించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోనున్నట్టు వెల్లడించింది. దీంతో దరఖాస్తు దారుల్లో ఆశలు చిగురించాయి. కానీ ఇది ఆచరణకు నోచుకోలేదు. తాజాగా ప్రభుత్వం మార్చి 31లోపు ఎల్ఆర్ఎస్‌కు దరఖాస్తు చేస్తే 25 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయం తీసుకుంది. అనధికారిక లే అవుట్‌లో కేవలం పది శాతం ప్లాట్లు రిజిస్టర్ అయి ఉండి.. మిగిలినవి రిజిస్టర్ కాకపోతే 90శాతం ప్లాట్ల క్రమబద్ధీకరణకు అనుమతించాలని కూడా నిర్ణయం తీసుకున్నారు. ఇందులో కొత్తదనమేమీ లేదు. ఎల్ఆర్ఎస్ ప్రవేశపెట్టినప్పుడే ఈఅవకాశం కల్పించారు. దీంతో చాలామంది రియల్టర్లు, అనుమతి లే అవుట్ల ప్లాట్లు కొన్నవారు మొదట్లో రూ.10వేల చొప్పున ఫీజు చెల్లించి దరఖాస్తులు చేసుకున్నారు. ఆ తర్వాత రూ.1000 చొప్పున వసూలు చేశారు. అయినా క్రమబద్ధీకరణ జరగలేదు. ప్లాట్ కొనుగోలుకు సంబంధించిన సేల్ డీడ్ రిజిస్ట్రేషన్ ఉన్నవారికి కూడా 25 శాతం రాయితీ ఇస్తున్నట్టు తాజాగా చేసిన ప్రకటన కొంత ఊరటకలిగిస్తోంది. ప్రభుత్వం ప్రకటించిన ఈ రాయితీతోనైనా ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారంలో కదలికవస్తుందా? అన్నది సందేహమే. గతంలో ఎదురైన చేదు అనుభవాల దృష్ట్యా దరఖాస్తుదారుల్లో పెద్దగా ఉత్సాహం కనిపించడం లేదు.

ఆశపడి కొంటే..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు

మిగతా 7వ పేజీలో...



1.41లక్షల దరఖాస్తులు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో మొత్తం 1,41,810 ఎల్ఆర్ఎస్ దరఖాస్తులు ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. గ్రేటర్ వరంగల్ మున్సిపాలిటీలో 99,221, వర్ధన్నపేట మున్సిపాలిటీలో 460, పరకాల మున్సిపాలిటీలో 3,194, నర్సంపేట పురపాలక సంఘంలో 5,421 దరఖాస్తులు, జనగామ మున్సిపాలిటీలో 6300, మహబూబాబాద్ మున్సిపాలిటీలో 7546, తొర్రూరు పురపాలికలో 3,200, డోర్నకల్ మున్సిపాలిటిలో 3,600, మరిపెడ మున్సిపాలిటీలో 4,234, భూపాలపల్లి పురపాలక సంఘంలో 7,234, దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గ్రామ పంచాయతీల్లో మరో 1,400 దరఖాస్తులు అందాయి. ప్రతీ దరఖాస్తు రుసుము కింద రూ.వెయ్యి చొప్పన మొత్తం రూ.1,48,10,000 ఆదాయం ప్రభుత్వానికి సమకూరింది. వరంగల్ కార్పొరేషన్ పరిధిలో దాఖలైన 99,221 దరఖాస్తుల్లో 10,871 పరిశీలించారు. 1,084 దరఖాస్తులకు సంబంధించి సరైన పత్రాలు లేవంటూ షార్ట్‌ఫాల్ చూపించారు. 80 దరఖాస్తులను తిరస్కరించారు. కేవలం 40 దరఖాస్తులను మాత్రమే ఆమోదించారు. వర్ధన్నపేట మున్సిపాలిటీలో 460 దరఖాస్తుల్లో 230, పరకాల మున్సిపాలిటీలో 3,194 దరఖాస్తుల్లో కేవలం అయిదింటిని, నర్సంపేట మున్సిపాలిటీల 5,421 దరఖాస్తుల్లో 1,849 పరిశీలించారు. మిగతా మున్సిపాలిటీల్లో దరఖాస్తుల పరిశీలిన అంతగా జరగలేదు.

వర్షాకాలంలోపే ఇసుక డంపింగ్ పూర్తి చేయాలి

భూగర్భజల, గనుల శాఖ ప్రధాన కార్యదర్శి శ్రీధర్



అధికారులతో మాట్లాడుతున్న మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీధర్

మహదేవపూర్/మహదేవపూర్ రూరల్, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : వానాకాలం ప్రారంభమయ్యేలోపే డంపింగ్ పూర్తి చేసి తగినంత ఇసుక నిల్వలు అందుబాటులో ఉంచాలని రాష్ట్ర గనుల, భూగర్భ శాఖ ప్రధాన కార్యదర్శి ఎన్.శ్రీధర్ అన్నారు. కలెక్టర్ రాహుల్ శర్మతో కలిసి మహదేవ పూర్ మండల పరిధిలోని అన్నారం, మద్దులపల్లి, పుసుకుపల్లి, బొమ్మాపూర్ పరిధిలోని ఇసుక క్వారీలను ఆయన గురువరం పరిశీలించారు. టీజీఎండీసీ నిబంధనల ప్రకారం నిర్ణీత సమయాల్లో గోదావరి నది నుంచి ఇసుకను స్టాక్‌యార్డుకు తరలించాలని అన్నారు. ఇష్టానుసారంగా ఇసుక డంపింగ్ చేపడితే సహించేది లేదని హెచ్చరించారు. రాత్రివేళల్లో డంపింగ్ చేసేందుకు అనుమతించబోమని అన్నారు. స్టాక్‌యార్డుల్లో లోడింగ్‌కు వినియోగించే యంత్రాలతోపాటు ఇసుక డంపింగ్ చేసేందుకు అదనంగా ఇంకొన్నింటిని అందుబాటులో ఉంచాలని కాంట్రాక్టర్లకు సూచించారు. అన్నారం ఇరిగేషన్ అధికారులతో డంపింగ్ తదితర అంశాలపై చర్చించారు. ఇసుక ఎంతవరకు ఉంది.. ఎంత వరకు డంపింగ్ చేయొచ్చని అడిగారు. బొమ్మాపూర్ క్వారీ పరిధిలో ఉన్నది ఇసుక ఫైన్ శాండ్ (మంచి క్వాలిటీ ఉన్న సన్న ఇసుక) అని, దీనికి మంచి డిమాండ్ ఉందన్నారు. 24గంటలు ఇసుక నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉండే నిల్వ సామర్థ్యాన్ని రెండు నుంచి మూడు రెట్లు అధికంగా ఉండేలా ఏర్పాట్లు చేయాలన్నారు. ప్రతి క్వారీలో ఫ్లడ్‌లైట్లతో పాటు సీసీ కెమెరాలు ఉండాలని, నిరంతర పర్యవేక్షణ చేయాలని అధికారులకు సూచించారు. తక్కువ

మిగతా8లో...

భూవివాదమే కారణం!

- రాజలింగమూర్తి హత్య కేసులో ప్రాథమిక నిర్ధారణకొచ్చిన పోలీసులు
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే
- కేసీఆర్‌పై కేసు నేపథ్యంలో రాజుకున్న రాజకీయ రంగు
- సీఎం సహా పలువురు నేతల వ్యాఖ్యలతో విస్తృత చర్చ
- బందోబస్తు మధ్య ముగిసిన రాజలింగమూర్తి అంత్యక్రియలు

వివరాలు 6లో..





అంతిమయాత్రలో రోదిస్తున్న మృతుడి భార్య సరళ, అంత్యక్రియలు జరుగుతున్న దృశ్యం

రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెల్లిరాజలింగం హత్యకు భూ వివాదాలే కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకొచ్చినట్టు తెలుస్తోంది. కాళేశ్వరం కుంగుబాటు సహా పలు ప్రభుత్వ, అటవీ భూవివాదాలు, అక్రమ కేటాయింపుల వ్యవహారం లాంటి హై ప్రొఫైల్ కేసుల్లో కీలకంగా వ్యవహరించిన రాజలింగమూర్తి హత్యకు గురవడంతో ఈ కేసు ప్రాధాన్యం సంతరించుకుంది. ఇది భూవివాదాల నేపథ్యంలో జరిగిన హత్యగానే కనిపిస్తున్నా.. దీని వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందన్న ఆరోపణలతో మరింత ఉత్కంఠగా మారింది. సీఎం సహా పలువురు మంత్రులు, ముఖ్యనేతలు కీలక వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో పోలీసులు ఈ కేసును సవాల్‌గా తీసుకోగా.. ఎస్పీ కిరణ్‌ఖరే స్వయంగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం. మరోవైపు తామే రాజలింగమూర్తిని హత్యచేశామంటూ భూపాలపల్లి పట్టణానికి చెందిన తండ్రీకొడుకులు రేణికుంట్ల సాంబయ్య, సంజీవ్ బుధవారం రాత్రే లొంగిపోగా గురువారం మరో నిందితుడు కుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఇక తన భర్తను భూ వివాదం నేపథ్యంలో హత్య చేశారని ఫిర్యాదు చేసిన రాజలింగమూర్తి భార్య, మాజీ కౌన్సిలర్ సరళ.. ఇందులో కొందరు బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబం ప్రమేయం ఉందని ఆరోపణలు చేయడం హాట్‌టాపిక్‌గా మారింది.

- భూపాలపల్లి కృష్ణకాలనీ, ఆంధ్రజ్యోతి

సుపారీ ఇచ్చి చంపించారనే అనుమానాలున్నాయి



సీబీసీఐడీ విచారణకు ప్రభుత్వాన్ని కోరతా

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

నాకు, బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదు



- మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

6

లారీ ఢీకొని ఒకరి మృతి



వెంకన్న మృతదేహం

రేగొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : లారీ ఢీకొనడంతో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మండలంలోని నారాయణపూర్ వద్ద గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జూబ్లీనగర్ గ్రామానికి చెందిన కొంపెల్లి వెంకన్న(42) ట్రాక్టర్‌లో మిర్చి బస్తాలతో వరంగల్ వ్యవసాయ మార్కెట్‌కు వెళ్తున్న క్రమంలో బస్తాలు పక్కకు జరిగాయి. దీంతో నారాయణపూర్ స్టేజీ వద్ద ట్రాక్టర్‌ను నిలిపారు. కిందికి దిగిన వెంకన్న బస్తాలు సరిచేస్తున్న క్రమంలో భూపాలపల్లి నుంచి పరకాల వైపు వెళ్తున్న లారీ ఢీకొట్టింది. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య లలిత, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ఇసుక లారీ ఢీకొని ఇద్దరు యువకులకు గాయాలు

ఇసుక లారీ ఢీకొట్టడంతో ఇద్దరు యువకులకు గాయాలైన సంఘటన మండలంలోని పరకాల భూపాలపల్లి రహదారిపై గురువారం చోటుచేసుకుంది. ఎస్సై సందీప్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కాటారం మండలం సూరారం గ్రామానికి చెందిన అభి, లడు ద్విచక్రవాహనంపై హైదరాబాద్‌కు వెళ్తున్న క్రమంలో అటువైపు వెళ్తున్న ఇసుక లారీ ద్విచక్రవాహనాన్ని వెనకాల నుంచి ఢీకొట్టింది. దీంతో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రులను అంబులెన్సులో ఆస్పత్రికి తరలించారు.



ఘర్షణ పడుతున్న ఆజంనగర్ గ్రామస్థులు, అటవీశాఖ సిబ్బంది

- అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్థుల మధ్య ఘర్షణ
- ఒకరిపై ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు
- ఫారెస్ట్ అధికారుల తీరుపై ఎమ్మెల్యే సత్యనారాయణరావు మండిపాటు

పోడు భూముల లొల్లి

కాకతీయఖని, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో పోడు భూముల లొల్లి రాజుకుంది. భూపాలపల్లి మండల పరిధి ఆజంనగర్‌లోని పోడు భూముల వద్దకు ఫారెస్టు అధికారులు గురువరం ట్రెంచ్‌లు కొట్టేందుకు యంత్రాలతో వెళ్లగా గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఫారెస్టు అధికారులు, గ్రామస్థుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి ఘర్షణకు దారి తీసింది. అటవీ శాఖ అధికారులు, గ్రామస్థులు పరస్పరంగా పోలీస్‌స్టేషన్లలో ఫిర్యాదులు చేసుకున్నారు. గ్రామస్థులు తమ సిబ్బందిపై దాడి చేశారని ఫారెస్టు అధికారులు ఆరోపిస్తున్నారు. ఫారెస్టు అధికారులు తమపై దాడి చేశారని, దీంతో ఓ మహిళ అపస్మారక స్థితిలోకి వెళ్లిందని గ్రామస్థులు అంటున్నారు.

అధికారుల పనులను అడ్డుకోలేదు

కొంతకాలంగా ఆజంనగర్‌లో సాగు చేసుకుంటున్న తమ భూమి చుట్టూ ట్రెంచ్ కొట్టేందుకు అటవీశాఖ సిబ్బంది సుమారు 150 మంది వచ్చారని గ్రామస్థులు తెలిపారు. వారి విధులను తాము అడ్డుకోలేదని, కేవలం జేసీబీలను ఆ భూమిలోకి వెళ్లకుండా అడ్డుపడ్డామని అన్నారు. ఇంతలో అటవీశాఖ సిబ్బంది ఒక్కసారిగా తమపై దాడికి దిగారని, దూర్భాషలాడుతూ బూటుకాళ్లతో విచక్షణ రహితంగా తన్నారని గ్రామస్థులు తెలిపారు. వారి దాడిలో పట్టం శారద అనే మహిళ స్పృహ కోల్పోయిందని తెలిపారు. ఆమెను వెంటనే భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని వంద పడకల ఆస్పత్రిలో చేర్పించామని తెలిపారు. అలాగే ఆమె మెడలోని రెండు తులాల బంగారు గొలుసు కనిపించడంలేదని ఆరోపించారు.

మా సిబ్బందిపై దాడి చేశారు...

అటవీ శాఖకు సంబంధించిన భూమిని కొందరు ఆక్రమించారని, దానిని స్వాధీనం చేసుకునేందుకు వెళ్లిన సిబ్బందిపై కొందరు గ్రామస్థులు దాడి చేశారని డీఎఫ్‌వో నవీన్‌రెడ్డి తెలిపారు. అటవీ శాఖకు సంబంధించిన జీపు అద్దాలను పగలగొట్టారని, ఓ ద్విచక్ర వాహనం హెడ్‌లైట్‌ను ధ్వంసం చేశారని తెలిపారు. మగ్బూల్ అహ్మద్‌ఖాన్ అనే ఎఫ్ఎస్‌వో తోపాటు బీట్ ఆఫీసర్ అనిల్, డ్రైవర్ సలీమ్‌పై గ్రామస్థులు దాడిచేశారని తెలిపారు. భూ ఆక్రమణను చేసినందుకు, విధులకు ఆటంకం కలిగించినం దుకు అబ్‌స్ట్రక్షన్ ఆఫ్ డ్యూటీ కింద పీవోపీ చేశా మన్నారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని తెలిపారు. గతంలో 10 మందిపై కేసు పెట్టామన్నారు.

పోలీస్ స్టేషన్‌లో పరస్పరణ ఫిర్యాదులు

ఫారెస్టు అధికారులు, గ్రామస్థులు పరస్పరంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు చేశారు. పదేళ్లుగా సుమారు ఐదెకరాల భూమిని సాగు చేసుకుంటున్నామని, అందుకు తమపై గతంలో కేసులు నమోదయ్యాయని గ్రామస్తులు తెలిపారు. గురువారం ఉదయం సుమారు 8 గంటల ప్రాంతంలో ఫారెస్టు సిబ్బంది తమ భూమిలో కందకాలు తీసేందుకు రాగా జేసీబీలను రానివ్వలేదని అన్నారు. దీంతో ఫారెస్టు సిబ్బంది తమపై దాడి చేశారని విమర్శించారు. ప్రస్తుతం ఆజంనగర్‌లో పనిచేస్తున్న ఎఫ్ఆర్‌వో తమను లంచం అడగగా గత సంవత్సరం రూ. 5లక్షలు ఆమెకు ఇచ్చామని తెలిపారు. ఈ సంవత్సరం కూడా రూ.2లక్షలు అడగగా ఇచ్చే పరిస్థితిలో లేమని చెప్పడంతో ఇలా తమపై దాడులు చేయించారని ఆరోపించారు. తమపై ఇబ్బందులకు గురిచేసిన ఆజంనగర్ ఎఫ్ఆర్‌వోపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు పొందిల్ల శ్రీనివాస్, పొందిల్ల రజిత, కొండి శారద భూపాలపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అలాగే జిల్లా అటవీశాఖ సిబ్బందితో కలిసి కొత్తగా పోడు జరిగిన ప్రాంతానికి వెళ్తున్న క్రమంలో కొందరు గ్రామస్థులు గుంపుగా వచ్చి అడ్డుకునే ప్రయత్నం చేసి తమపై దాడికి దిగారని, ఈ చర్యలకు పాల్పడిన శ్రీనివాస్‌ను, రజిత, శారదను అదుపులోకి తీసుకున్నామని, తమపై, తమ వాహనాలపై దాడి చేసిన వారిపై చర్య తీసుకోవాలని అటవీశాఖ అధికారులు ఉష, రజిత, అజయ్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

దాడిని ఖండిస్తున్నాం : ఎమ్మెల్యే గండ్ర

ఆజంనగర్ గ్రామస్థులపై ఫారెస్టు అధికారులు దాడి చేయడాన్ని ఖండిస్తున్నామని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. భూపాలపల్లిలోని కాంగ్రెస్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు ప్రజలకు సేవ చేసేందుకే ఉన్నారనే విషయాన్ని విస్మరించొద్దని హితవు పలికారు. రాక్షసుల్లా వ్యవహరించిన ఫారెస్టు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. 40 ఏళ్లుగా సాగుచేసుకుంటున్న భూములకు బోర్లు ఉన్నా కరెంటు స్తంభాలు వేయనివ్వకుండా డీఎఫ్‌వో అడ్డుకోవడం సరికాదని అన్నారు.





గాయాలు చూపిస్తున్న గ్రామస్థుడు, ఎఫ్ఎస్‌వో

భూవివాదమే కారణం!

- లింగమూర్తి హత్య కేసులో ప్రాథమిక నిర్ధారణకొచ్చిన పోలీసులు
- పోలీసుల అదుపులో ముగ్గురు నిందితులు
- దర్యాప్తును స్వయంగా పర్యవేక్షిస్తున్న ఎస్పీ కిరణ్‌ఖరే
- కేసీఆర్‌పై కేసు నేపథ్యంలో రాజుకున్న రాజకీయ రంగు
- సీఎం సహా పలువురు నేతల వ్యాఖ్యలతో విస్తృత చర్చ

భూపాలపల్లి కృష్ణకాలనీ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర వ్యాప్తంగా తీవ్ర సంచలనం రేపిన భూపాలపల్లి జిల్లా కేంద్రానికి చెందిన సామాజిక కార్యకర్త నాగవెళ్లిరాజలింగం హత్యకు భూ వివాదాలే కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకొచ్చినట్టు తెలుస్తోంది. జిల్లాలోని పలు భూవివాదాలు, కాళేశ్వరం సహా అటవీ భూముల అక్రమ కేటాయింపుల వ్యవహారం లాంటి హై ప్రొఫైల్ కేసుల్లో రాజలింగమూర్తే కీలకంగా వ్యవహరించిన నేపథ్యంలో ఆయన హత్య రాజకీయ రంగు పులుముకుంటోంది. అయితే పైకి ఇది భూవివాదాల నేపథ్యంలో జరిగిన హత్యగా కనిపిస్తున్నా.. దీని వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందన్న అధికారపార్టీ నేతలు చేస్తున్న ఆరోపణలతో వాతావరణం వేడెక్కుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి సహా పలువురు మంత్రులు, ముఖ్యనేతలు ఈ కేసుపై కీలకమైన వ్యాఖ్యలు చేసిన నేపథ్యంలో పోలీసులు దర్యాప్తును సవాల్‌గా తీసుకోగా.. ఎస్పీ కిరణ్‌ఖరే స్వయంగా పర్యవేక్షిస్తుండటం గమనార్హం. మరోవైపు తామే రాజలింగమూర్తిని హత్యచేశామంటూ భూపాలపల్లి పట్టణానికి చెందిన ఇద్దరు వ్యక్తులు బుధవారం రాత్రే పోలీసులకు లొంగిపోగా గురువారం మరో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఈ ముగ్గురిని ప్రస్తుతం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఉంచి విచారణ జరుపుతున్నట్టు తెలి సింది. బుధవారం రాత్రి హత్య జరిగిన వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు హత్యలో ఎవరెవరికి సంబంధాలున్నాయన్న కోణంలో విచారణ ప్రారంభించారు. ఈ క్రమంలో రాజలింగమూర్తి భార్య, మాజీ కౌన్సిలర్ సరళ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు అంశాలు దర్యాప్తులో కీలకంగా మారినట్టు పోలీసు వర్గాలు చెబుతున్నాయి. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదుతో పాటు తాము నిర్వహించిన దర్యాప్తు వరకు ఈ హత్యకు ప్రధానంగా భూ వివాదమే కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చినట్టు తెలుస్తోంది. అయితే, దీని వెనుక రాజకీయ కుట్ర కూడా ఉండోచ్చుననే అధికార పార్టీ ఎమ్మెల్యేతో పాటు పలువురు నాయకులు అనుమానాలు వ్యక్తం చేసిన నేపథ్యంలో ఆ దిశగా కూడా విచారణ జరుపతున్నారు.

కేసీఆర్‌పై కేసు నేపథ్యంలో.. ప్రాధాన్యం

మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై భూపాలపల్లి జిల్లా కోర్టులో కేసు నమోదైన నేపథ్యంలో రాజకీయంగా ఈ హత్య తీవ్ర చర్చనీయాంశమైంది. 2023అక్టోబరు 21న కాళేశ్వరంలోని మేడిగడ్డ ప్రాజెక్టులో 7వ బ్లాక్‌కుంగిపోయిన ఘటనకు సంబంధించి అప్పట్లో రాజలింగమూర్తి అప్పటి కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశారు. అయినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతో హైకోర్టును ఆశ్రయించాడు. ఈ నేపథ్యంలో రివిజన్ పిటిషన్‌ను స్వీకరించిన హైకోర్టు భూపాలపల్లి జిల్లా కోర్టుకు కేసును బదిలీ చేసింది. ఈ క్రమంలో గతేడాది సెప్టెంబరులో కాళేశ్వరం కుంగుబాటుకు అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, నీటిపారుదలశాఖ మంత్రి తన్నీరు హరీ‌ష్‌రావు సహా ప్రాజెక్టు ఇంజనీర్లు, కాంట్రాక్టర్లు నాణ్యత ప్రమాణాలు పాటించకపోవడమే కారణమంటూ పిటీషన్ వేయడంతో.. ప్రతివాదులైన కేసీఆర్ బృందానికి కోర్టులో హాజరు కావాలని భూపాలపల్లి కోర్టు రెండు సార్లు సమన్లు జారీ చేసింది.

అయినా కేసీఆర్ ఇక్కడ కోర్టుకు హాజరుకాలేదు. వివిధ కారణాలను చూపుతూ బీఆర్ఎస్ పక్షాన వాదించిన లాయర్లు కేసును హైకోర్టుకు బదిలీ చేయాలని కోరడంతో ప్రస్తుతం ఈకేసు హైకోర్టులో నడుస్తోంది. గురువారమే ఈ కేసుకు సంబంధించి ఫైనల్ హియరింగ్ ఉండటం, బుధవారం రాత్రే రాజలింగమూర్తి హత్యకు గురికావడంతో దీనివెనుక రాజకీయ కుట్ర ఉందనే హతుడి భార్య ఆరోపణలు చేస్తోంది. ఇటు అధికార పార్టీ ఎమ్మెల్యే కూడా ఇంచుమించు ఇవే అభిప్రాయాలను వ్యక్తం చేయడంతో ప్రస్తుతం ఈకేసు విచారణ పోలీసులకు సవాల్‌గా మారింది.

మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదులోని అంశాలు..

మృతుడి భార్య సరళ ఇచ్చిన ఫిర్యాదు ప్రకారం భూపాలపల్లి కృష్ణకాలనీకి వెళ్లేదారిలో పోలీస్‌స్టేషన్‌కు ఎదురుగా ఉన్న భూమి విషయంలో ఏర్పడిన వివాదంలో రేణికుంట్ల కొమురయ్య, రేణికుంట్ల సంజీవ్ కుటుంబసభ్యులతో కొంతకాలంగా గొడవ జరుగుతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దౌర్జన్యంగా తమకు చెందిన భూమిని కాజేసే ప్రయత్నం చేస్తుండటంతో తాము సివిల్‌కోర్టులో కేసు వేశామని, ఆ కేసులో తీర్పు తమకు అనుకూలంగా వచ్చేలా ఉందని భావించి బుధవారం సాయంత్రం ద్విచక్ర వాహనంపై వస్తున్న తన భర్తను రేణికుంట్ల సంజీవ్, మల్హర్‌రావు మండలంపెద్దతూండ్లకు చెందిన పింగిలి శీమంత్ అలియాస్ బబ్లూ, భూపాలపల్లి మండలంలోని కొంపెల్లికి చెందిన మోరే కుమార్, భూపాలపల్లికి చెందిన కొత్తూరి కుమార్ అనే నలుగురు వ్యక్తులు రెండు వాహనాలపై వచ్చి తన భర్తను టీబీజీకేఎస్ కార్యాలయం ఎదురుగా అడ్డగించి ఇనుప రాడ్లతో తల మీద కొట్టి, కడుపు భాగంలో కత్తులతో పొడిచి కిరాతకంగా హత్య చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు పలు సెక్షన్ల కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. అయితే ఈ హత్య వెనుక వీరిని రాజకీయంగా ప్రేరేపించి ఉంటారని, బీఆర్ఎస్ నేతలు, కేసీఆర్ కుటుంబం హస్తం ఉందని సరళ ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరిపించి అసలు నిందితులను చట్టం ముందుకు తేవాలని డిమాండ్ చేసింది. కేసీఆర్, హరీష్‌రావు సహా స్థానిక మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి హస్తముందని విలపిస్తూ ఆమె విలేకరులకు తెలిపింది.

పోలీసుల అదుపులో నిందితులు?

రాజలింగమూర్తి హత్య కేసులో ముగ్గురు నిందితులు పోలీసులు అదుపులో ఉన్నట్టు సమాచారం. తామే హత్య చేశామంటూ ఇద్దరు బుధవారం రాత్రే పోలీసులకు లొంగిపోగా.. గురువారం మరో నిందితుడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్టు తెలిసింది. ఇంకో ఇద్దరి కోసం పోలీసులు గాలింపు చేపట్టారని సమాచారం. ఎంతో కీలకంగా మారిన ఈ కేసు దర్యాప్తుపై ఎస్పీ కిరణ్‌ఖరే సమీక్షించారు. ఆయనే స్వయంగా భూపాలపల్లి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించి అటు బాధితులు, అదుపులో ఉన్న నిందితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నట్టు తెలిసింది. ఈ హత్య విషయమై డీఎస్పీ సంపత్‌రావు విలేకరు లతో మాట్లాడారు. హత్యచేసిన వ్యక్తుల్లో ఎంతటి వారున్న వదిలే ప్రసక్తే లేదని దర్యాప్తు ముమ్మరం చేశామని ఆయన స్పష్టం చేశారు.



రాజలింగమూర్తి మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

హాట్ టాపిక్‌గా హత్యోదంతం..

రాజలింగమూర్తి హత్య వెనుక కాళేశ్వరం కేసే కారణమన్న అభిప్రాయాలను కాంగ్రెస్ నేతలు వ్యక్తం చేస్తుండటం తీవ్ర చర్చకు దారితీస్తోంది. సీఎం సహా స్థానిక ఎమ్మెల్యే వరకు ఈ కేసు వ్యవహారంపై స్పందించడంతో జనాల్లోనూ చర్చ జరుగుతోంది. ఇక ఈ హత్యకు సంబంధించిన సమాచారాన్ని సీఎం రేవంత్‌రెడ్డి ఇంటిలిజెన్స్, స్థానిక అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఇక హత్యలో మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి ప్రమేయం ఉందని, రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. మరోవైపు ఇది కచ్చితంగా కేసీఆర్, హరీష్‌రావు పనే అంటూ కాంగ్రెస్ నేత అద్దంకి దయాకర్ చేసిన వ్యాఖ్యలు కూడా వైరల్‌గా మారాయి.

స్థానిక ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు కూడా హత్య వెనుక రాజకీయ కుట్ర కోణం ఉందనే అనుమానాలు వ్యక్తం చేయడం విస్తృత చర్చకు దారితీస్తోంది. ఇదిలా ఉంటే బీఆర్ఎస్ నేతలు కూడా స్పందిస్తూ హత్యతో తమకు సంబంధం లేదంటూ చేస్తున్న వ్యాఖ్యలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి.

ముగిసిన అంత్యక్రియలు

భూపాలపల్లి పట్టణంలో హత్యకు గురైన నాగవెళ్లి రాజలింగమూర్తి అంత్యక్రియలు గురువారం ప్రశాతంగా ముగిశాయి. 100 పడకల ఆసుపత్రిలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం మధ్యాహ్నం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం సాయంత్రం సమయంలో బాంబులగడ్డ సమీపంలో అంత్యక్రియలు జరగ్గా.. మృతుడి కుమారుడు సాయి అంతిమసంస్కారాలు నిర్వహించారు. రాజలింగమూర్తి భార్య సరళ, కుమార్తె సాహితి, కుమారుడు సాయి సహా కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. కాగా, పోస్టుమార్టం, అంత్యక్రియల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసుల బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రశాంతంగా ఈ కార్యక్రమాలు ముగియడంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

సుపారీ ఇచ్చి చంపించారనే అనుమానాలున్నాయి

సీబీసీఐడీ విచారణ కోసం ప్రభుత్వాన్ని కోరతా

భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు

రాజలింగమూర్తి హత్యను చూస్తుంటే సుపారీ ఇచ్చి చంపించారనే అనుమానాలు కలుగుతున్నాయని, దీనిపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని ప్రభుత్వాన్ని కోరతానని భూపాలపల్లి ఎమ్మెల్యేగండ్ర సత్యనారాయణరావు స్పష్టం చేశారు. జిల్లా కేంద్రంలోని తన కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లిలో గతంలో ఎప్పుడూ హత్యారాజకీయాలు లేవని, రాజలింగమూర్తి హత్యను తమ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఇక హత్య చేసిన వ్యక్తులు లొంగిపోవడం అనేక అనుమానాలకు తావిస్తోందని, దీని వెనుక రాజకీయ కోణం కూడా ఉండొచ్చనే అనుమానాలు వ్యక్తం చేశారు.

గతంలో రాజలింగమూర్తి మేడిగడ్డలో అవినీతి జరిగిందని కోర్టులో పిల్ వేయడంలో గానీ, ప్రభుత్వ భూముల విషయాల్లో పిటిషన్లు వేయడంలో గానీ.. గత ప్రభుత్వ పెద్దలకు సంబంధించిన పలు వివాదాల్లో క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వచ్చారన్నారు. ఆయన అనుమానస్పద రీతిలో హత్యకు గురవడం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. సీఎం రేవంత్, మంత్రి కోమటిరెడ్డి కూడా ఈకేసు వివరాలను అడిగి తెలుసుకున్నారని, పూర్తి స్థాయిలో విచారణజరపాలని పోలీసులను ఆదేశించారన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సత్యనారాయణరావు

హత్యతో నాకు, బీఆర్ఎస్‌కు ఎలాంటి సంబంధం లేదు

భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి

రాజలింగమూర్తి హత్యతో తనకు గానీ బీఆర్ఎస్ పార్టీకి గానీ ఎలాంటి సంబంధం లేదని భూపాలపల్లి మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి స్పష్టం చేశారు. గురువారం మధ్యాహ్నం హైదరాబాద్ నుంచి స్థానిక మీడియా ప్రతినిధులతో ఫోన్‌లో మాట్లాడిన ఆయన రాజలింగమూర్తి హత్య విషయంలో కొందరు పని గట్టుకొని తనపై బురద జల్లేప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. తానుఏనాడూ హత్యరాజకీయాలను ప్రోత్సహించలేదని, రాజకీయపరమైన దురుద్దేశాలతో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి లాంటి వారు తనను బద్నామ్ చేస్తున్నారని మండిపడ్డారు. ఎలాంటి ఆధారాలు లేకుండానే కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తనపై ఆరోపణలు చేయడమేంటని, వ్యక్తిగత, భూ వివాదాల నేపథ్యంలో జరిగిన హత్యను రాజకీయం చేయడం ఎవరికీ మంచిది కాదని అభిప్రాయపడ్డారు.

భార్య కాపురానికి రావడం లేదని.. భర్త ఆత్మహత్య

మహబూబాబాద్ జిల్లాలో ఘటన



యాదగిరి (ఫైల్)

కురవి (మహబూబాబాద్ జిల్లా), ఫిబ్రవరి20 (ఆంధ్రజ్యోతి) : భార్య కాపురానికి రావడం లేదని మనస్తాపంతో పెట్రోల్ పోసుకుని, నిప్పంటించుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన గురువారం మహబూబాబాద్ జిల్లా కురవిలో చోటు చేసుకుంది. ఎస్సై సతీష్ తెలిపిన వివరాల ప్రకారం. కురవికి చెందిన తరాల యాదగిరి (42)కి 20 ఏళ్ల క్రితం వివాహం కాగా, ఇద్దరు పిల్లలు జన్మించిన తర్వాత మొదటి భార్య చనిపోయింది. కొద్దిరోజుల తరువాత యాదగిరి మరో మహిళను వివాహం చేసుకున్నాడు. ఇద్దరు పిల్లలు జన్మించాక యాదగిరి మద్యం సేవిస్తుండడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో ఇంట్లో ఒంటరిగా ఉంటున్న యాదగిరి గురువారం ఉదయం పెట్రోల్ కొని తెచ్చుకుని, ఒంటిపై పోసుకుని నిప్పంటించుకున్నాడు. దీంతో యాదగిరి మృతదేహం 60 శాతం మంటల్లో కాలిబూడిదైంది. ఎస్సై సతీష్ ఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు జరిపి, ఆత్మహత్యగా నిర్ధారించారు. మృతుడి కుమారుడు అఖిల్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా అస్పత్రికి తరలించారు.

చేపల వేటకు వెళ్లి.. విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



జాటోత్ రెడ్డి (ఫైల్)

నెల్లికుదురు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : చేపల వేటకు వెళ్లి విద్యుదాఘాతానికి గురై ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలంలోని మేచరాజుపెల్లి శివారు కట్టుకాలువ తండాలో బుధవారం రాత్రి జరిగింది. గురువారం ఎస్సై రమేష్‌బాబు కథనం ప్రకారం. కట్టుకాలువ తండాకు చెందిన జాటోత్‌రెడ్డి (28)తో పాటు అదేతండాకు చెందిన ధరంసోత్‌రెడ్డి, బీకు, గుగులోత్‌రాజు, సోమ్లా, మోహన్, బాదావత్ తిరమలేష్, జాటోత్ నర్సింహ, నామాలు కలిసి బుధవారం ఆకేరు వాగులో చేపలు పట్టడానికి వెళ్లారు. విద్యుత్ తీగలతో చేపలు పట్టుతున్న క్రమంలో జాటోత్‌రెడ్డి నీటిలోకి దిగాడు. వెంటనే విద్యుత్ ఘాతంతో నీటిలో పడి మృతి చెందాడు. మృతుడికి భార్య మమత ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు జాటోత్‌రెడ్డి మృతికి కారణమైన 8 మందిపై కేసు నమోదు చేసి, పోస్టు మార్టంకు తరలించినట్లు ఎస్సై రమేష్ వివరించారు

వృద్ధుడి అదృశ్యం



సారంగం

ఖానాపురం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రానికి చెందిన ఓ వృద్ధుడు మేడారం జాతరకు వెళ్లి అదృశ్యమైనట్లు ఆయన భార్య సుగుణమ్మ గురువారం తెలిపారు. వృద్ధుడు జబ్బ సారంగం(60) ఈనెల 13న తమ బంధువులతో కలిసి మేడారం జాతరకు వెళ్లి జాతరలో తప్పి పోయాడు. మేడారంతో పాటు సమీప గ్రామాల్లో వెతికినా సారంగం ఆచూకీ లభించలేదని ఈ విషయమై తాడ్వాయి పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. సారంగం ఆచూకీ లభిస్తే 9959692278, 9390787847 ఫోన్ నెంబర్లకు సమాచారం అందించాలని సూచించారు.

సమస్యలపై కరపత్రాల విడుదల

తొర్రూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు ప్రాంత సమస్యల పరిష్కారానికి పాలకులు నిర్లక్ష్యం వీడాలని కోరుతూ వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో గురువారం కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐఎంఎల్ మాస్‌లైన్ జిల్లా కార్యదర్శి కొత్తపల్లి రవి, సీపీఎం జిల్లానాయకులు బొల్లం అశోక్, సీపీఐ మండల కార్యదర్శి బందు మహేందర్ మాట్లాడుతూ తొర్రూరు పట్టణంలో ప్రారంభమైన అభివృద్ధి పనులను వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. డ్రైనేజీలు, సీసీరోడ్లు, రోడ్ల మధ్య ఉన్న కరెంట్ పోల్స్ తొలగించి రోడ్ల నిర్మాణం పూర్తి చేయాలని, ట్యాంక్ బండ్ నిర్మాణం కోసం వచ్చిన నిధులు వెనక్కి వెళ్లే పరిస్థితి ఉందని వెంటనే పనులు ప్రారంభించాలన్నారు.

తొర్రూరు డివిజన్ కేంద్రంలో ఎస్టీవో, సబ్ రిజిస్ట్రార్, ఫైర్ స్టేషన్, ఇరిగేషన్ ఆఫీస్, ఇండోర్ స్టేడియం, వంద పడకల ప్రభుత్వ ఆస్పత్రి పనులను ప్రారంభించాలని ఇతర ప్రభుత్వ కార్యాలయాలు కూడా అందుబాటులోకి తీసుకురావాలన్నారు. ప్రభుత్వం వెంటనే సమస్యలు పరిష్కరించాలని లేనిచో ఆందోళనలు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు వీరన్న, యాకూబ్, భిక్షపతి, పుల్లయ్య, కిరణ్, శ్రీను, సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే హత్యలు జరుగుతుంటే సీఎం ఏం చేస్తున్నారు?

ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

బాలసముద్రం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): పట్ట పగలే హత్యలు జరుగుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఏంచేస్తున్నారని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ ప్రశ్నించారు. గురువారం హనుమకొండలోని హరిత కాకతీయ హోటల్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. భూపాలపల్లిలో బుధవారం సాయంత్రం హత్య జరిగి సీసీ కెమెరాలు ఉన్నప్పటికీ నిందితులను ఇంతవరకు పోలీసులు ఎందుకు అరెస్టు చేయలేదని ఆయన ప్రశ్నించారు. రాజ లింగమూర్తి కుటుంబానికి న్యాయం చేయకపోతే సంబంధిత ప్రజాప్రతినిధులు, పోలీసుల కుటుంబాలను దేవుడు నాశనం చేస్తాడని ఆయన అన్నారు. రేవంత్‌రెడ్డి హోంమినిస్టర్‌గా రాజీనామా చేసేంత వరకు తమ పోరాటం ఆగదని కేఏ పాల్ ప్రతిజ్ఞ చేశారు. రెడ్డి, వెలమ దొరల రాజ్యం వద్దని, బీసీ అయిన తనను ఒక్కసారి ముఖ్యమంత్రిగా గెలిపిస్తే అద్భుతాలు జరుగుతాయని అన్నారు. ప్రస్తుతం బీసీలు వివిధ పార్టీల్లో బానిసలుగా పని చేస్తున్నారని, బ్రాహ్మణ పార్టీలో ఉన్న బండి సంజయ్, ఈటల రాజేందర్‌లు ఆ పార్టీ నుంచి బయటకు రావాలని ఆయన పిలుపునిచ్చారు. బీసీలకు రాజ్యాధికారం కోసం తాను ఒక్కడినే ఎంతకాలం పోరాటం చేస్తానని, అన్ని పార్టీలో ఉన్న బీసీలు బయటకు వచ్చి రాజ్యాధికారం పొందేందుకు పాటుపడాలని అన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేఏపాల్

'రామప్ప' భక్తుల సేవలో పోలీసులు

- 300 మందితో బందోబస్తుకు కార్యాచరణ
- ములుగు డీఎస్పీ నలువాల రవీందర్



రామప్పలో భద్రత ఏర్పాట్లను పరిశీలిస్తున్న డీఎస్పీ రవీందర్

వెంకటాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మహాశివరాత్రి సందర్భంగా రామప్ప ఆలయం వద్ద భక్తుల సేవలో పోలీసు శాఖ పాలుపంచుకుంటుందని డీఎస్పీ నలువాల రవీందర్ తెలిపారు. గురువారం ఆయన రామప్ప రామలింగేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాశివరాత్రి ఉత్సవాల్లో పాల్గొనే భక్తుల సేవల్లో పోలీసు శాఖ పాలుపంచుకుంటారని అన్నారు. 300 మందితో పోలీసు బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్టు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పోలీసు సిబ్బందికి సూచించారు. రామప్ప సరస్సు ప్రాంతంలో సాయంత్రం 6 గంటల తర్వాత భక్తులను అనుమతించొద్దని, సరస్సు వద్ద పూర్తి బందోబస్తు నిర్వహించాలని సూచించారు. అంతేకాకుండా రామప్పకు వచ్చే భక్తులు క్యూలైన్ల ద్వారా దర్శించుకునేలా చూడాలని అన్నారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా రామప్ప పరిసర ప్రాంతాల్లో మూడు రోజులపాటు మద్యం, మాంసం విక్రయాలు, అసాంఘిక కార్యక్రమాలు, స్పీడ్ డ్రైవింగ్, తొక్కిసలాట జరుగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. మూడురోజులపాటు జరిగే మహాశివరాత్రి ఉత్సవాల సందర్భంగా ఇద్దరు డీఎస్పీలు, ఎనిమిదిమంది సీఐలు, 12మంది ఎస్సైలు, మిగతా పోలీస్ సిబ్బందితో బందోబస్తు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ములుగు సీఐ శంకర్, వెంకటాపూర్ ఎస్సై జక్కుల సతీష్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

యూరియా కొరతతో రైతులకు ఇబ్బందులు

తొర్రూరు, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తొర్రూరు డివిజన్ కేంద్రంలో యూరియా దొరకక రైతులు అవస్థలు పడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆగ్రోస్ కేంద్రాలు, రైతు సహకార కేంద్రాల్లో యూరియా అందుబాటులో లేక నానా ఇబ్బందులు పడుతున్నారు. వారం రోజులుగా తొర్రూరు డివిజన్ పరిధిలో ఆయ గ్రామాల రైతులు యూరియా కోసం పట్టణంలోని పీఏసీఎస్ కేంద్రాల వద్ద బారులు తీరి లైన్‌లలో నిల్చున్నా యూరియా దొరకడం లేదు. ప్రస్తుత యాసంగిలో వరి, మొక్కజొన్న సాగు చేయడంతో యూరియా వేయాల్సిఉంది. గురువారం సహకార సంఘాలకు యూరియా వచ్చిందన్న సమాచారంతో రైతులు పెద్ద ఎత్తున బారులు తీరారు. నిర్వాహకులు ఒక్కో రైతుకు రెండు బస్తాలు మాత్రమే ఇవ్వడంతో మిగిలిన రైతులు నిరాశతో వెనుదిరిగారు. రైతులు భారీగా యూరియా కోసం వస్తుండటంతో అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

బస్తా ధర రూ.268 ఉండగా ప్రైవేటు ఎరువుల దుకాణాల్లో రూ.320 వరకు విక్రయిస్తున్నారు. కొందరు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తున్నారనే ఆరోపణలున్నాయి. యూరియా బ్లాక్ మార్కెట్‌లో విక్రయిస్తున్నా వ్యవసాయ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై మండల వ్యవసాయాధికారి భాస్కర్‌ను వివరణ కోరగా గురువారం 40టన్నుల యూరియా పంపిణీ చేశామన్నారు. శుక్ర, శనివారాల్లో మరో100 టన్నుల వరకు యూరియా నిల్వలు వస్తాయని రైతులు ఎలాంటి ఆందోళన చెందవద్దన్నారు. యూరియా నిల్వలు అందుబాటులో లేవనడం సరికాదని, మండలానికి సరిపడా యూరియా సరఫరా చేస్తామన్నారు.



సొసైటీ కేంద్రం వద్ద యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు

వరంగల్ మార్కెట్ ధరలు


(రూ. క్వింటాల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	2306	2100
పల్లికాయ (సూక)	6110	4600
పల్లికాయ (పచ్చిది)	5600	3100
కందులు	7227	5540
పెసళ్లు	7029	4645
పత్తి	6810	5800
కొత్త పత్తి	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13600	9000
తేజ ఏసీ	-	-
వండర్‌హాట్	16300	11500
యూఎస్ 341	13300	11500
దేశీ	22000	20500
ఎల్లో మిర్చి	17000	17000
దీపిక	16100	15245
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం



చాక్‌పీస్‌లపై పర్యావరణ నినాదాలు

పెన్సిల్ లెడ్‌పై న్యూ ఇయర్ విషెస్



నరేష్ సాధించిన పతకాలు

సూక్ష్మ కళ.. నైపుణ్యం భళా

రాణిస్తున్న అనుముల నరేష్

మరిపెడ రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : 'కుక్క, పిల్ల.. సబ్బు బిళ్ల.. అగ్గిపుల్ల.. కాదేదీ కవితక నర్హం' అన్నట్టుగా సృజనాత్మకత ఉండాలే కాని, సృష్టిలో పనికిరాని వస్తువంటూ ఉండదని నిరూపిస్తున్నాడు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం అబ్బాయిపాలెంకు చెందిన అనుముల నరేష్. హరినాథ్‌బాబు-ఉమ దంపతుల కుమారుడైన నరేష్ బీఎస్సీ, బీఈడీ పూర్తి చేసి ఓ ప్రైవేట్ పాఠశాలలో గణిత ఉపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. ఆయన చేతిలో ఏది పడినా అందమైన రూపంగా మారుతుంది. పెసర దినుసు, పెన్సిల్ లిడ్, పోస్టుకార్డు, బియ్యపు గింజ, చాక్‌పీస్‌లపై పాతికకు పైగా సూక్ష్మ చిత్రాలను తీర్చిదిద్దడం ఆయనకు 'పెన్ను'తో పెట్టిన విద్య అని నిరూపిస్తున్నాడు. పదో తరగతిలో ఉండగా వినాయకుడి చిత్రం గీయడం ద్వారా మొదలైన ప్రస్థానం ఇప్పటి వరకు 25 చిత్రాలతో పాటు, పలు కళాఖండాలతో కొనసాగుతోంది.

నరేష్ రూపొందించిన కళా రూపాల్లో కొన్ని..

పోస్టుకార్డుపై 105 సార్లు జాతీయ గీతం. 144 ఇంటూ 144 సుడోకు బోర్డు, అందులో 20,736 స్క్వేర్ బాక్స్‌లుంటాయి. చాక్‌పీస్‌పై స్వామి వివేకానందుడు, మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, అంబేద్కర్, ప్రధాని మోదీ బొమ్మలు, పర్యావరణం గురించి నినాదాలు లిఖించాడు. ఓటర్లను చైతన్యం పరచడం కోసం జాతీయ ఓటర్స్ డే సందర్భంగా బియ్యపు గింజపై వంద శాతం ఓటింగ్ కోసం నినాదాలు రాశాడు.


పూర్వ కలెక్టర్ నుంచి అవార్డు అందుకుంటున్న అనుముల నరేష్ (ఫైల్)


నరేష్

సందర్భోచితం.. ఆకృతి ప్రత్యేకం

తన కంటూ ప్రత్యేకత చాటాలనుకుని నరేష్ జాతీయ, ప్రాంతీయ పండుగల సమయాల్లో ప్రజలను చైతన్యపరచడం కోసం సుద్దముక్కలపై బొమ్మలు, నినాదాలను రూపొందిస్తున్నాడు. బతుకమ్మ పండుగకు పెన్సిల్ లెడ్‌పై బతుకమ్మను అందంగా చిత్రించి అందరినీ ఆకట్టుకున్నాడు.

రికార్డులు.. ప్రశంసలు.. సత్కారాలు

జాతీయ స్థాయిలో పలు రికార్డుల్లో చోటు దక్కించుకున్న నరేష్ ఎవరెస్ట్ బుక్ ఆఫ్ రికార్డు, అసిస్టు వరల్డ్ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు, జీనియస్ బుక్ ఆఫ్ రికార్డు, తెలంగాణ బుక్ ఆఫ్ రికార్డు, సూపర్‌బీ బుక్ ఆఫ్ రికార్డులో చోటు దక్కించుకున్నాడు. అలాగే మహబూబాబాద్ జిల్లా పూర్వ కలెక్టర్ ప్రీతిమీనా చేతుల మీదుగా ఉత్తమ కళాకారుడి పురస్కారం అందుకున్నాడు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్ నుంచి బెస్ట్ అవార్డు, అప్పటి ఎస్పీ నంద్యాల కోటిరెడ్డి నుంచి ఆర్టిస్టు వరల్డ్ రికార్డు సర్టిఫికెట్‌ను అందుకున్నాడు. ఎస్వీ రంగారావు ఎక్స్‌లెన్సీ అవార్డును మాజీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి, తమిళనాడు మాజీ గవర్నర్ కొణిజేటి రోశయ్య చేతుల మీదుగా హైదరాబాద్‌లో జరిగిన కార్యక్రమంలో తీసుకున్నారు.

వీరభద్రుడి లగ్గానికి రారండోయ్

- కురవి జాతరకు ఏర్పాట్లు
- ప్రచార రథం ప్రారంభం.. ఉత్సవాల షెడ్యూల్ విడుదల
- ఈనెల 25 నుంచి వచ్చే నెల 12 వరకు వేడుకలు

కురవి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మహా శివరాత్రి సందర్భంగా మహబూబాబాద్ జిల్లా కురవిలో జరిగే వీరభద్రస్వామి, భద్రకాళిమాత కల్యాణానికి ఏర్పాట్లు చురుగ్గా కొనసాగుతున్నాయి. స్వామివారి లగ్గానికి రావాలంటూ ఆలయ అధికారులు ఆహ్వాన పత్రికలు, పోస్టర్‌లు, కరపత్రాలు ముద్రించి పంపిణీ చేస్తున్నారు. కరపత్రాలు ఇంటింటికీ పంపుతూ, బస్సులు, గ్రామాల్లో గోడలకు పోస్టర్లు అతికిస్తూ, అతిథులకు ఆహ్వానపత్రికలు పంపుతూ భక్తులు పెద్దసంఖ్యలో స్వామివారి కల్యాణానికి హాజరయ్యేలా అధికారులు ప్రచారాన్ని నిర్వహిస్తున్నారు. జాతర వివరాలు ప్రజలకు తెలిసేలా ఈసారి ప్రచార రథాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఈ రథాన్ని ఆలయ చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ గురువారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్ తదితరులు పాల్గొన్నారు.

25న అంకురార్పణతో జాతర ప్రారంభం

కురవి శ్రీవీరభద్రస్వామి జాతర ఈనెల 25న మంగళవారం సాయంత్రం 7 గంటలకు అంకురార్పణతో ప్రారంభం కానుంది. 26న బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకుని 11 గంటల వరకు పూర్ణాభిషేకం, రాత్రి 7 గంటలకు గ్రామసేవ, ఎదురుకోలు, తెల్లవారుజామున (గురువారం) 12:30 గంటలకు శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి కల్యాణ మహోత్సవం నిర్వహిస్తారు. మార్చి 1వ తేదీ శనివారం కురవి పెద్దచెరువులో తెప్పోత్సవం కార్యక్రమాన్ని సాయంత్రం 6:30 గంటలకు నిర్వహిస్తారు. 3వ తేదీ సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, 4న ఉదయం 10 గంటలకు పూర్ణాహుతి, సాయంత్రం 4 గంటలకు బండ్లు తిరిగే కార్యక్రమం, పారువేట నిర్వహిస్తారు. 5న ఉదయం దోపోత్సవం, వసంతోత్సవం, త్రిశూలస్నానం, సాయంత్రం ఏకాంత సేవ, నాగవెల్లి పూజాకార్యక్రమాలను నిర్వహిస్తారు. 6న సాయంత్రం స్వామివారి పవళింపుసేవ, 10న శ్రీపార్వతి సమేత రామలింగేశ్వరస్వామి కల్యాణం, 12న పదహారు రోజుల పండుగ పూజా కార్యక్రమాన్ని నిర్వహిస్తారు.


జాతర ప్రచార రథాన్ని ప్రారంభిస్తున్న చైర్మన్ కోర్ని రవీందర్‌రెడ్డి, ఈవో సత్యనారాయణ



వీరభద్రస్వామి కల్యాణ ఆహ్వానపత్రిక

(5వ పేజీ తరువాయి)

రాయితీతోనైనా.. మోక్షం లభించేనా ?

ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విచ్చలవిడిగా అక్రమ లే అవుట్లు చేసి ప్రభుత్వాదాయానికి గండికొడుతున్నారు. తక్కువ ధరకు ప్లాట్లు వస్తున్నాయనే ఆశతో వేలాది మంది ప్లాట్లు కొనుగోలు చేశారు. ఇలాంటి ప్లాట్లలో ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం అనుమతివ్వకపోవడంతో ప్లాట్ల యజమానులు దయనీయస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ దుస్థితిని తొలగించేందుకు గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2015లో అక్రమ లేఅవుట్ల క్రమబద్ధీకరణకు ఎల్ఆర్ఎస్ పథకాన్ని తెచ్చింది. లేఅవుట్ల క్రమబద్ధీకరణకు దరఖాస్తులను ఆహ్వానించింది. దీంతో రూ.10వేల చొప్పున చెల్లించి ప్లాట్ల యజమానులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ విషయంలో కొందరు కోర్టుకు వెళ్లడంతో ఎల్ఆర్ఎస్ క్రమబద్ధీకరణ నిలిచిపోయింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తు చేసుకున్నవారికి భవన నిర్మాణ అనుమతుల్లో కొంత వెసులుబాటు కల్పించినా ఆశించిన మేరకు క్రమబద్ధీకరణ జరగలేదు.

తర్వాత 2020 ఆగస్టులో ప్రభుత్వం మరో జీవో తీసుకువచ్చింది. ఇందులో ప్లాట్లకు సంబంధించి రూ.వెయ్యి చొప్పున చెల్లించేందుకు అవకాశం కల్పించారు. క్రమబద్ధీకరణకు స్థలం విలువ లెక్కింపునకు ప్రభుత్వం శ్లాబులవారీగా కూడా ధరలు నిర్ణయించింది. ఈ మేరకు మార్గదర్శకాలను కూడా జారీ చేసింది. ఎల్ఆర్ఎస్ చార్జీలు తగ్గిస్తూ 2020లో ఉత్తర్వులు జారీ అయ్యాయి. చదరపు గజం ధర ఆధారంగా క్రమబద్ధీకరణ కోసం చార్జీల స్లాబుల సంఖ్యను పెంచింది. నిర్దేశించిన ఖాళీ స్థలాలు వదలని చోట్ల చెల్లించాల్సిన రుసుము రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్ నిర్ణయించే ధరను ప్రాతిపదికగా చేసింది. ప్రత్యేకంగా నాలా చార్జీ లు తెల్లించాల్సిన అవసరం లేదని ప్రకటించింది. ఈ క్రమబద్ధీకరణ పథకం జీవో 131 ప్రకారం స్వీకరించిన దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ అప్పట్లోనే ప్రారంభమైంది. ఈ మేరకు అనుమతులకు సంబంధించి ప్రభుత్వం నుంచి మున్సిపల్ కమిషనర్లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే పలు కారణాల వల్ల క్రమబద్ధీకరణ ప్రక్రియ ముందుకు సాగలేదు.

ఇన్నాళ్లు మార్గదర్శకాలు లేక..

సెల్‌ఫోన్ యాప్, పురపాలక శాఖ వెబ్ సైట్ (ఎల్ఆర్ఎస్-2020) ద్వారా వేలాది మంది దరఖాస్తు చేసుకున్నారు. భారీగా వచ్చిన దరఖాస్తులను ఎలా పరిశీలించాలి? ఎన్ని విడతల్లో ప్రక్రియ చేపట్టాలనే అంశంపై యంత్రాంగంలో స్పష్టత లేక ఇంతకాలం ఈ ప్రక్రియ ముందుకు సాగలేదు. అడపాతడపా ఈ అంశమై ప్రభుత్వం నుంచి వచ్చిన ఆదేశాలతో దరఖాస్తుల పరిశీలన చేపట్టిన అధికారులు.. చర్యలు తీసుకున్నా అందుకు సంబంధించిన మార్గదర్శకాలు సరిగాలేకపోవడంతో మున్సిపాలిటీలు ఇంత కాలం ముందుకు సాగలేదు. తాజాగా ప్రభుత్వ ప్రకటనతో అధికారులు ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన కసరత్తు ముమ్మరం కానున్నది.

సిబ్బంది కొరతతో అవస్థలు

ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలనకు సిబ్బంది కొరత అడ్డంకిగా మారింది. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిశీలన, క్రమబద్ధీకరణ ప్రక్రియ చేపట్టాలంటే నిపుణులైన ప్లానింగ్ సిబ్బంది కీలకం. మున్సిపాలిటీల్లో అవసరమైన మేరకు సిబ్బంది లేరు. క్షేత్ర స్థాయిలో దరఖాస్తులు పరిశీలించేందుకు బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్లు, సర్వేయర్లు చైన్‌మెన్లు ముఖ్యం. వరంగల్ మహానగర పాలక సంస్థ, జనగామ, మహబూబాబాద్, నర్సంపేట మున్సిపాలిటీల్లో మాత్రమే కొంత మేరకు ఉన్నారు. వీరికి ఇతర మున్సిపాలిటీల బాధ్యతలను అప్పగించారు. సిబ్బంది సరిపడా లేకపోవడంతో దరఖాస్తుల పరిశీలన వేగవంతంపై సందేహాలు వ్యక్తమవుతున్నాయి. వేలల్లో అందిన దరఖాస్తులను లోతుగా పరిశీలించి క్షేత్రస్థాయిలో తనఖీలు చేసి ప్రొసీడింగ్స్ ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల మేరకు భూ క్రమబద్ధీకరణ పథకం అమలు కదలిక వచ్చినా సిబ్బంది కొరత వల్ల ముందుకు సాగే పరిస్థితులు కనిపించడం లేదు.

భారీగా సమకూరనున్న ఆదాయం

ప్రభుత్వం తాజాగా ప్రకటించిన 25 శాతం రాయితీతో దరఖాస్తుదారులు క్రమబద్ధీకరణకు ఉత్సాహంగా ముందుకు వస్తే ఉమ్మడి జిల్లాలోని తొమ్మిది మున్సిపాలిటీలకు పెద్ద మొత్తంలో ఆదాయం సమకూరే అవకాశం ఉంది. దరఖాస్తుదారు వంద గజాల లోపు స్థలం రెగ్యులరైజ్ చేసుకుంటే పురపాలికకు ఆయా ప్రాంతాలను బట్టి ఒక్కో దరఖాస్తు ద్వారా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు ఆదాయం సమకూరుతుంది. బహిరంగ మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి ఈ విలువ మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ప్లాట్ల క్రమబద్ధీకరణకు రిజిస్ట్రేషన్ సమయంలో ఉన్న ప్లాటు మార్కెట్ విలువలో 14 శాతం వసూలు చేయనున్నది. ఇందులో ప్రభుత్వం 25 శాతం రాయితీ ఇచ్చినా పట్టణాల్లోనే ప్లాట్లు అధికంగా ఉండడంతో ఆయా మున్సిపాలిటీలకు క్రమబద్ధీకరణతో రూ.వందల కోట్లలో ఆదాయం సమకూరనున్నది.

భద్రకాళి అమ్మవారి సన్నిధిలో సినీ హీరో గోపీచంద్

వరంగల్ కల్చరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ తెలుగు సినీ హీరో టి.గోపీచంద్ భద్రకాళి అమ్మవారిని దర్శించుకున్నారు. చారిత్రక భద్రకాళి అమ్మవారిని గురువారం సినీ హీరో గోపీచంద్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజ అనంతరం ఆలయ ఈవో శేషు భారతి, అర్చకులు భద్రకాళి శేషు, నాగరాజుశర్మలు గోపీచంద్‌ను ఆశీర్వదించి అమ్మవారి తీర్థ ప్రసాదం, శేష వస్త్రాలను అందజేశారు. కార్యక్రమంలో సినీ నిర్మాత చిట్టూరి శ్రీనివాస్ ఆలయ సూపరింటెండెంట్ విజయ్‌కుమార్, ఫొటోగ్రాఫర్ శ్యామ్, హరినాథ్, నవీన్ పాల్గొన్నారు.


అమ్మవారిని దర్శించుకొని ఆశీస్సులు పొందుతున్న సినీ హీరో గోపీచంద్

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో లవ్లీత్‌కు స్వర్ణం


స్వర్ణం పతకం సాధించిన లవ్లీత్

వరంగల్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ఇటీవల హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీలో నిర్వహించిన 11వ తెలంగాణ రాష్ట్రస్థాయి యూత్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ పోటీల్లో వంగపహాడ్‌కు చెందిన కంచు లవ్లీత్ స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. రాష్ట్రస్థాయి అండర్-14 బాలుర ట్రైథ్లాన్ విభాగంలో లవ్లీత్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చి స్వర్ణ పతకంతో మెరిశాడు. ప్రస్తుతం లవ్లీత్ హనుమకొండలోని ఎంజేపీ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్నాడు. ఈ మేరకు స్వర్ణ పతకం సాధించిన లవ్లీత్‌ను అథ్లెటిక్స్ అసోసియేషన్ రాష్ట్రకార్యదర్శి సారంగపాణి, జిల్లా అసోసియేషన్ బాధ్యులు, సీనియర్ క్రీడాకారులు అభినందించారు.

వచ్చే నెలలో రాజనీతి శాస్త్ర విభాగంలో సదస్సు

కేయూ క్యాంపస్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): కేయూ రాజనీతిశాస్త్ర విభాగం నేతృత్వంలో మార్చి 21, 22 తేదీల్లో రెండు రోజుల జాతీయ సదస్సుకు తెలంగాణ రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలక్రిష్ణారెడ్డి, సామాజిక వేత్త, విశ్లేషకుడు ప్రొఫెసర్ బీ. హరగోపాల్‌ను హైదరాబాద్‌లో కలిసి ఆహ్వానించినట్లు విభాగాధిపతి డాక్టర్ సంకినేని వెంకట్ తెలిపారు. ఈ మేరకు గురువారం కేయూ రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకులతో కలిసి హైదరాబాద్‌లోని రాష్ట్ర ఉన్నత విద్యామండలి కార్యాలయంలో బాలకృష్ణారెడ్డిని, హరగోపాల్ నివాసంలో కలిసి ఆహ్వాన పత్రాలను అందించి సదస్సుకు రావాలని కోరినట్లు వెల్లడించారు. ఈ సందర్భంగా సంకినేని వెంకట్ సదస్సు వివరాలను తెలిపారు. కోరిలేషన్స్ పాలిటిక్స్ అండ్ డెమోక్రసీ ఇన్ ఇండియన్ సొసైటీ అనే అంశంపై జరిగే సదస్సు జరుగుతోందని పేర్కొన్నారు. సంకీర్ణ ప్రభుత్వాలు, భారత సమాఖ్య స్ఫూర్తి, ప్రజాస్వామ్యం, జాతీయ ప్రభుత్వాలు, ప్రాంతీయ పార్టీలపై సదస్సులో కీలక ప్రతిపాదనలు చేస్తామని వెల్లడించారు. న్యూఢిల్లీలోని ఐసీఎస్ఎస్ఆర్, తెలంగాణ ఉన్నత విద్యామండలి, కేయూ యూజీసీ సహకారంతో సదస్సు నిర్వహిస్తామని తెలిపారు. సదస్సులో మేధావులు, పరిశోధకులు, అధ్యాపకులు, విద్యార్థులందరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజనీతిశాస్త్ర విభాగం అధ్యాపకులు డాక్టర్ వడ్లకొండ సత్యనారాయణ, డాక్టర్ వేదపల్లి నాగరాజు, స్కాలర్స్ అంకిళ్ల శంకర్, కలిపికొండ వినోద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు లైబ్రరీ సైన్స్ విభాగం జాతీయ సదస్సు

కాకతీయ యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీ, వర్సిటీ లైబ్రరీ సైన్స్ విభాగం సంయుక్తంగా శుక్రవారం 'వన్ నేషన్ వన్ సబ్‌స్క్రిప్షన్' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నట్లు గ్రంథాలయం మెంబర్ ఇన్‌చార్జి ప్రొఫెసర్ సీజే శ్రీలత, లైబ్రరీ సైన్స్ విభాగాధిపతి డాక్టర్ బి.రాధికారాణిలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కేయూ సెనెట్ హాల్‌లో ప్రారంభమయ్యే సదస్సుకు కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి, ప్రముఖ లైబ్రరీ రంగనిపుణులు దేవిక పి.మదల్లి కీలక ప్రసంగం చేస్తారని తెలిపారు. గౌరవ అతిథులుగా సోషల్ సైన్స్, ఆర్ట్స్ ఇన్‌చార్జి డీన్ ప్రొఫెసర్ తాళ్లపల్లి మనోహర్, సైన్స్ డీన్ ప్రొఫెసర్ జి.హనుమంతు, కామర్స్ డీన్ ప్రొఫెసర్ అమరవేణి, ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ గాదె సమ్మయ్య, లా డీన్ ప్రొఫెసర్ ఎం.శ్రీనివాస్‌లు హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం జరిగే ముగింపు సదస్సులో ముఖ్యఅతిథిగా కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, యూజీసీ కేయూ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఆర్.మల్లికార్జున్‌రెడ్డి, క్యాంపస్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మమత పాల్గొంటారని పేర్కొన్నారు. అందరూ హాజరై సదస్సును విజయవంతం చేయాలని కోరారు.



పోస్టర్‌ను బాలకృష్ణారెడ్డికి అందజేస్తున్న హెడ్ వెంకట్, తదితరులు

నేటి నుంచి ఆల్ ఇండియా ఇంటర్ నిట్ టోర్నీ

- క్రీడా పోటీలకు ప్రాంగణం ముస్తాబు
- పాల్గొననున్న 750 మంది క్రీడాకారులు

హనుమకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): నేటి నుంచి 23వతేదీ వరకు జరిగే ఆల్ ఇండియా ఇంటర్ నిట్ టోర్నమెంట్‌కు వరంగల్ నిట్ ముస్తాబైంది. ఈ మేరకు క్యాంపస్‌లో ఏర్పాట్లు చేశారు. శుక్రవారం ఉదయం 10 గంటలకు ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుంది. ఈ క్రీడా పోటీల్లో దేశంలోని 22 ఎన్ఐటీల నుంచి 750 మంది క్రీడాకారులు పాల్గొననున్నారు. వీరిలో 450 మంది పురుషులు కాగా, 350 మంది మహిళా క్రీడాకారిణులు. మూడు ఈవెంట్లు వాలీబాల్, హ్యాండ్ బాల్, యోగాలలో ఈ పోటీలు జరుగుతాయి. స్పోర్ట్స్ సెంటర్ హెడ్ ప్రొఫెసర్ పి.రవికుమార్ ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. క్రీడాకారులు గురువారం సాయంత్రం నుంచి నిట్‌కు చేరుకోవడం ప్రారంభమైంది. వీరందరికీ నిట్ క్యాంపస్‌లో భోజన, వసతి ఏర్పాట్లు చేశారు. ఈ మూడు ఈవెంట్లు క్యాంపస్‌లోని ఇండోర్ స్టేడియంలలో నిర్వహిస్తారు. టోర్నమెంట్ నిర్వహణకు 60 మంది అధికారులతో పాటు మరో 30 మంది జాతీయ, అంతర్జాతీయ స్థాయి అధికారులను నియమించారు.

పోటీల నిర్వహణకు ప్రత్యేక పరిశీలకుడిగా పుదుచ్చేరి నిట్ సీనియర్ స్టూడెంట్ యాక్టివిటీ సెంటర్ (ఎస్ఏఎస్) ఆఫీసర్ డాక్టర్ బాబు వ్యవహరిస్తారు. కాగా, విద్యార్థుల పక్షాన స్పోర్ట్స్ సెక్రెటరీ అధర్వ పాండే, స్పోర్ట్స్ జాయింట్ సెక్రెటరీ శుభంగి ఠాకూర్, కోర్ టీమ్ సభ్యులు హర్షిత సజ్జన్, అక్షత్ గుప్తా, భవిక్ జైన్ క్రీడా ఏర్పాట్లను పర్యవేక్షిస్తారు. విద్యార్థుల్లోని క్రీడాప్రతిభను వెలుగులోకి తీసుకురావడంతోపాటు వారిలో క్రీడా స్ఫూర్తిని పెంపొందించడంలో ఈ టోర్నమెంట్ వేదికగా నిలవనున్నది. యేటా దేశంలోని వివిధ ఎన్ఐటీలలో 20 క్రీడల్లో ఈ పోటీలు జరుగుతాయి. ఈ సారి వాలీబాల్, హ్యాండ్‌బాల్, యోగాలలో పోటీలు నిర్వహించే అవకాశం వరంగల్ నిట్‌కు లభించింది.



నిట్ టోర్నమెంట్ బ్రోచర్

వచ్చె.. వచ్చె.. వసంతోత్సవం

వరంగల్ నిట్‌లో 28 నుంచి స్ప్రింగ్ స్ప్రీ

హనుమకొండ, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ప్రతిష్ఠాత్మకమైన వరంగల్ నిట్‌లో ఈనెల 28 నుంచి మార్చి 2వ తేదీ వరకు స్ప్రింగ్ స్ప్రీ (సాంస్కృతికోత్సవం) అంగరంగ వైభవంగా జరగనున్నది. ఈ మేరకు నిట్ క్యాంపస్ ముస్తాబవుతోంది. ఈనెల 28వ తేదీన జరిగే ప్రారంభోత్సవ కార్యక్రమానికి ప్రముఖ హాస్యనటుడు, పద్మశ్రీ డాక్టర్ బ్రహ్మానందం ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు.

ఈమేరకు నిట్ స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్య గురువారం హైదరాబాద్‌లో బ్రహ్మానందం నివాస గృహంలో కలిసి ఈ మేరకు ఆహ్వానించారు. స్ప్రింగ్ స్ప్రీ వేడుకలకు హాజరయ్యేందుకు బ్రహ్మానందం అంగీకారం తెలిపారు. సంగీతం, నృత్యం, కళలు, వినోదం వంటి రంగాల్లో విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయడానికి నిట్ కళాశాల యేటా ఈ స్ప్రింగ్ స్ప్రీని నిర్వహిస్తోంది. వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా నిలుస్తోంది. దక్షిణ భారతదేశంలోని నిట్ కళాశాలల్లో ఒకటిగా వరంగల్ నిట్‌లో నిర్వహించే స్ప్రింగ్ స్ప్రీకి మంచి పేరుంది. దేశవ్యాప్తంగా వివిధ ఎన్ఐటీల నుంచి విద్యార్థులు తమ ప్రతిభాపాటవాలను ప్రదర్శించేందుకు పెద్ద సంఖ్యలో హాజరవుతుంటారు.

స్ప్రింగ్ స్ప్రీ వేడుకల్లో భాగంగా సంగీత, సాహిత్య కళారంగాల్లో లబ్ధప్రతిష్టులైన, జాతీయ అంతర్జాతీయ స్థాయిలో పేరుగడించిన ప్రముఖ కళాకారులను ఆహ్వానించడం, వారి ప్రదర్శనలను ఏర్పాటు చేయడం ఆనవాయితీ. వేడుకల్లో భాగంగా నిర్వహించే పోటీలు, వర్క్‌షాపులు, ప్రోషోల వంటి విభిన్న కార్యక్రమాలు ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేస్తాయి. సాంస్కృతిక ప్రదర్శనలు, సాహిత్య కార్యక్రమాలు, సాహసక్రీడలు, సంగీత విభావరి వంటి అనేక కార్యక్రమాలను ఈ సందర్భంగా నిర్వహించనున్నారు. స్ప్రింగ్ స్ప్రీ-2025 విద్యార్థుల ప్రతిభకు, సృజనాత్మకతకు పట్టంగలదని భావిస్తున్నారు. తన ఆమోఘమైన హాస్యంతో కోట్లాది మంది హృదయాలను గెలుచుకున్న బ్రహ్మానందం.. ఈ సారి స్ప్రింగ్ స్ప్రీ వేడుకలకు హాజరు కావడం ప్రత్యేక ఆకర్షణగా నిలువనున్నది.

బాల కుమార స్వామిని దర్శించుకున్న భక్తులు


బాలకుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న పూజారులు, వడ్డెలు

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): ములుగు మండలంలోని అంకన్నగూడెంలో బాల కుమార స్వామి మినీ జాతర గురువారం జరిగింది. భక్తులు పెద్దసంఖ్యలో దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ప్రతి రెండేళ్లకోసారి మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర అనంతరం అంకన్నగూడెంలో బాల కుమారస్వామి జాతరను ఆదివాసీలు కొన్ని శతాబ్దాలుగా సొంత ఖర్చులతో నిర్వహించుకుంటున్నారు. మేడారం మినీజాతర ముగిసిన అనంతరం ఆదివాసీలు బాలకుమారస్వామి మినీ జాతర నిర్వహించారు. ఈసందర్భంగా వివిధ ప్రాంతాలకు చెందిన భక్తులు బాలకుమారస్వామిని దర్శించుకోగా పూజారులు కొట్టెం నారాయణ, బాలయ్య, వడ్డెలు, పెద్దలు అల్లెం సాంబయ్య తీర్థ ప్రసాదాలు అందజేశారు.

కుక్కల సొమ్ము ఏదీ?!


భూపాలపల్లిలో వీధికుక్కలు

భూపాలపల్లిటౌన్, ఫిబ్రవరి 20 (ఆంధ్ర జ్యోతి): ఎంతో శ్రమచేసి, చమటోడ్చి సంపా దించి రకరకాల పన్నుల పేరుతో ప్రజలు మునిసి పాలిటీకి ఆదాయం ఇస్తుంటే.. ఆ ధనాన్ని అధికారులు, ప్రజా ప్రతిని, దులు అప్పనంగా కాజేస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కుక్కల పట్టివేత పేరుతో అక్షరాల రూ.4 లక్షలను పంచు కున్నట్లు విమర్శలు వస్తున్నాయి. భూపాలపల్లి మునిసిపాలిటీ పరిధిలో ప్రతి వార్డులో కుక్కలు విపరీతంగా పెరిగాయి. పైగా వాటికి అలర్జీ సోకడంతో వాటిపై ఉన్న వెంట్రుకలు ఊడిపోయి, చర్మం పలుచబడి పుండ్లు కావడంతో సన్నగా మారి అవి మృత్యువాతప డుతున్నాయి. దీంతో ప్రజలు భయాందోళనకు గురవు తున్నారు. ఈ క్రమంలో సింగరేణి కార్మికులు రెండో షిఫ్టు, రాత్రి షిఫ్టు విధులు ముగించుకుని, తిరిగి ఇంటికి వస్తుండగా వారి బైక్ వెంటపడి కుక్కలు కాటేసిన సందర్భాలు ఉన్నాయి. ఇటీవల మంజూర్‌నగర్‌లో ఓ మహిళ కుక్కల కాటుకు బలైంది. ఈ నేపథ్యంలోనే పలువురు పట్టణ ప్రజలు మునిసిపల్ అధికారులకు, కౌన్సిలర్లకు ఫిర్యాదు చేశారు. దీంతో స్పందించిన వారు సెప్టెంబరు 30న కుక్కల పట్టివేత కోసం రూ.4 లక్షలు ఖర్చు చేస్తున్నట్లు తీర్మానం చేశారు. అందులో రూ.2 లక్షలు వాటిని పట్టుకునే వ్యక్తికి అడ్వాన్స్‌గా అప్పగిం చినట్లు సమాచారం. పట్టణంలోని కుక్కలను పూర్తిగా పట్టుకున్న అనం తరం మిగిలిన రూ.2లక్షలు కూడా ఇవ్వాల్సిందిగా తీర్మానం చేసుకున్నారు. తూతూమంత్రంగా కుక్కలను పట్టుకుని మొత్తం రూ.4లక్షలు బిల్లు కాజేసినట్లు ఆరోపణలు వినిపి స్తున్నాయి. నిజానికి కుక్కలను పట్టు కుంటే పట్టణంలో పెంపుడు కుక్కలు మినహా వీధి కుక్కలు కనిపించకూడదు. కానీ ఏ కాలనీలో చూసినా విచ్చలవిడిగా పదుల సంఖ్యలో గుంపులో కుక్కలు స్వైరవి హారం చేస్తున్నాయి. దీంతో ఆ బిల్లులను కొందరు అధికారులు, పలువురు మాజీ కౌన్సిలర్లు కలిసి పంచుకున్నట్లు ఆరోపణలు వస్తు న్నాయి. నిధుల దుర్వి నియోగం విషయంపై మునిసిపల్ ప్రత్యేక అధికారి, అడిషనల్ కలెక్టర్ విజయలక్ష్మిని వివరణ కోరగా కుక్కల పట్టివేత కార్యక్రమాన్ని చేపట్టింది వాస్తవమే. కానీ అవకతవకలపై నాకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదు. అయినప్పటికీ దీనిపై విచారణ చేపట్టి తప్పు జరిగితే తప్పనిసరిగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అభయారణ్యంలో టోల్‌గేట్

- పర్యావరణ రుసుం వసూలుకు ఫాస్టాగ్
- ములుగు జిల్లాలో అటవీ శాఖ వినూత్న ప్రయోగం



ఏటూరునాగారం చెక్‌పోస్టు వద్ద సిద్ధమవుతున్న టోల్‌గేట్

ఏటూరునాగారం రూరల్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): అటవీ శాఖ వినూత్న విధానాన్ని ప్రవేశపెడుడతోంది. రాష్ట్రంలోనే మొట్టమొద టిసారిగా పర్యావరణ పరిరక్షణ రుసుం వసూళ్లకు శ్రీకారం చుడుతోంది. అభయారణ్యంలో టోల్‌గేట్‌ను ఏర్పాటు చేసి ఫాస్టాగ్ విధానాన్ని అమ ల్లోకి తీసుకురానుంది. జాతీయ రహదారులపై రుసుం వసూలు చేస్తున్న తరహాలోనే ఏటూరునాగారం అభయా రణ్యంలోకి ప్రవేశించే వాహనాల కూ ఫాస్టాగ్ వర్తించనుంది. ప్రస్తుతం టోల్‌గేట్ నిర్మాణ పనులు జరు గుతుండగా త్వరలోనే ఫాస్టాక్ విధానం అమల్లోకి రానుంది. పర్యావరణ పరిరక్షణ రుసుం పేరుతో భారీ వాహనాలకు మాత్రమే ప్రస్తుతం అటవీశాఖ రుసుం వసూలు చేస్తోంది. ఫాస్టాగ్ విధానం అమల్లోకి వస్తే అన్ని వాహ నాలకూ రుసుం చెల్లించాల్సి ఉంటుంది.

ములుగు జిల్లాలో నాలుగు చోట్లా..

ములుగు జిల్లా వ్యాప్తంగా నాలుగు చోట్లా పర్యావరణ పరిరక్షణ రుసుం వసూళ్లకు ఫాస్టాగ్ టోల్‌గేట్లను అటవీశాఖ సిద్ధం చేస్తున్నది. ఏటూరునాగారం, పస్రా, తాడ్వాయి, కొత్త నాగారం వద్ద అటవీశాఖ పాత చెక్‌పోస్టులు ఉండగా వాటి స్థానంలోనే ఈ ఫాస్టాగ్ టోల్‌గేట్ విధానాన్ని ఏర్పాటు చేసేందుకు సిద్ధమయ్యారు. ఒక్కో టోల్‌గేట్ నిర్మాణానికి అటవీశాఖ రూ.5లక్షలు వెచ్చించి చేపడుతుండగా ప్రస్తుతం ఏటూరునాగారం చెక్‌పోస్టు వద్ద పనులు ప్రారంభమై వేగవంతంగా జరుగుతున్నాయి. మిగిలిన మూడుచోట్ల పనులను త్వరలోనే ప్రారంభిం చనున్నట్లు అటవీశాఖ పేర్కొంటుంది. ఏటూరునాగారం చెక్‌పోస్టు వద్ద జరుగుతున్న పనులను మరో 15రోజుల వ్యవధిలో పూర్తిచేసి ఫాస్టాగ్ టోల్‌గేట్ విధానాన్ని అమలులోకి తీసుకురానున్నట్లు అటవీశాఖ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

వాహనదారులకు షాక్

ఏటూరునాగారం నుంచి పస్రా వరకు అభయారణ్యం విస్తరించి ఉంది. ప్రస్తుతం అటవీశాఖ అభయారణ్యంలోకి ప్రవేశించే భారీ వాహ నాలకు మాత్రమే పర్యావరణ పరిరక్షణ రుసుంను వసూలు చేస్తుంది. లారీలు, డీసీ ఎంలు, కంటైనర్లు, తదితర వాహనాలు పస్రా నుంచి ఏటూరునాగారం మీదుగా వెళ్లేక్రమంలో పస్రా వద్ద ఈ రుసుం వసూలు చేస్తుండగా, ఏటూరునాగారం నుంచి వరంగల్ వెళ్లే భారీ వాహనాలకు ఏటూ రునాగారం వద్ద పర్యావరణ పరిరక్షణ రుసుంను అటవీశాఖ వసూలు చేస్తుంది. త్వరలో రానున్న పర్యావ రణ ఫాస్టాగ్ టోల్‌గేట్ల విధానం అమ లులోకి వస్తే అన్ని వాహ నాలకు రుసుం చెల్లించాల్సి ఉంటుంది. ఇప్పటికే మచ్చాపూర్ వద్ద జాతీయ రహదారుల సంస్థ వాహనాల నుంచి రుసుం వసూలు చేస్తుండగా మళ్లీ అటవీశాఖ అభయారణ్యంలోకి ప్రవేశించిన వెంటనే రుసుం వసూలు చేయనుం డడంతో వాహనదారులకు తడిసి మోపె డయ్యే పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం అభయారణ్యంలో ప్రవేశించిన భారీ వాహనాలకు అటవీశాఖ రూ.200ల చొప్పున వసూలు చేస్తుండగా ఈఫాస్టాగ్ టోల్‌గేట్ విధానం అమలులోకి వస్తే మిగతా వాహనాలను బట్టి రూ.50నుంచి రూ.100వరకు వసూలు చేయనున్నట్లు తెలుస్తోంది. దీంతో వాహనదారులు ఈరుసుముల గోల భరించేదెట్లానని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

గోవిందరావుపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం లీగల్ ఆఫీసర్ డి.సంజీవ అన్నారు. మండలంలోని చల్వాయి కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం యువతరం యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెహ్రూ యువకేంద్ర సహకారంతో అంతర్జాతీయ సామాజిక న్యాయం అనే అంశంపై అవగాహన సదస్సు జరగగా ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యాహక్కు, బాల్య వివాహ నిరోధకం, బాలకార్మిక, పోక్సో, ఆస్తిహక్కు చట్టాల గురించి బాధ్యతాయుతంగా గౌరవ మర్యాదలతో మెలగాలన్నారు. యువతరం ప్రతినిధి బండారి అనిల్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు ఒక లక్ష్యంతో చదవాలన్నారు. అనంతరం విద్యార్థినులకు వరల్డ్ సోషల్ జస్టిస్ అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా ప్రతిభ కనబరిచిన వారికి బహుమతులు అందజేశారు. ఈ సదస్సులో కళాశాల స్పెషలాఫీసర్ వెంకటలక్ష్మి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీకాంత్



ఏటూరునాగారం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం మండల అధ్యక్షుడిగా రాంనగర్‌కు చెందిన గడబోయిన శ్రీకాంత్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షుడిగా వంగపండ్ల రవి యాదవ్, ప్రధాన కార్యదర్శిగా అల్లంల చంటి యాదవ్, కోశాధికారిగా గార నరేందర్, ప్రచార కార్యదర్శిగా వడకపురం సారయ్య, గౌరవ సలహాదారుడిగా తీగల సమ్మయ్యను ఎన్నుకున్నారు. మండల కేంద్రంలో ఆ సంఘం ములుగు జిల్లా అధ్యక్షుడు పత్తిపాక రాముపర్మ ఆధ్వర్యంలో గురువారం ఈ కార్యక్రమం జరిగింది.

మహాశివరాత్రి కరపత్రాల ఆవిష్కరణ

మంగపేట, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీ ఉమాచంద్రశేఖర స్వామి దేవాలయంలో 26న జరగనున్న మహాశివరాత్రి వేడుకలకు సంబంధించిన కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఛైర్మన్ కొలగట్ల నరేష్‌రెడ్డి, ప్రధాన అర్చకుడు విస్సావఝ్ఝల నరేష్ శర్మ మాట్లాడుతూ మహా శివరాత్రి రోజు తెల్లవారు జామున 4 గంటల నుంచి మహన్యాసకపూర్వక రుద్రాభిషేకాలు ప్రారంభమ వుతాయని తెలిపారు. అదేరోజు సాయంత్రం 6 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. రాత్రి 11 గంటల నుంచి తెల్లవారుజాము వరకు శ్రీ ఉమాచంద్ర శేఖరస్వామి దివ్య కల్యాణ మహో త్సవాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం ఉత్సవమూర్తుల ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు కొమరగిరి సామ్రాజ్యం, చాద మల్లయ్య, కొప్పాక సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

'దేవాదుల'లో మరో మోటారు ఆన్

కన్నాయిగూడెం, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తుపాకుల గూడెం గ్రామ పంచాయతీ పరిధి గుట్టల గంగారం వద్ద ఉన్న జె.చొక్కారావు దేవాదుల ఎత్తిపోతల ప్రాజెక్టు నుంచి గురువారం ఫేజ్ 2లో మరో మోటారును ఆన్ చేశారు. బుధవారం ఉదయం వరకు ఫేజ్ 3 నుంచి రెండు మోటార్ల ద్వారా నీటిని పంపింగ్ చేసిన అధికారులు అదే రోజు రాత్రికి పంపింగ్‌ను పూర్తిగా నిలిపివేశారు. తిరిగి గురువారం మధాహ్నం ఫేజ్ 2లో ఒక మోటారు, ఫేజ్ 3లో రెండు మోటార్లను ఆన్ చేసి నీటిని పంపింగ్ చేస్తున్నారు. మొత్తం మూడు మోటార్ల ద్వారా 831 క్యూసెక్కుల నీటిని భీంఘనపూర్ రిజర్వాయర్‌కు ఎత్తి పోస్తున్నారు. ఇదిలా ఉండగా తుపాకులగూడెం వద్ద ఉన్న సమ్మక్క సాగర్ బ్యారేజీకి ఇన్‌ఫ్లో కొనసాగుతోంది. ఎగువ నుంచి 2,350 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండటంతో బ్యారేజీలోని ఒక గేటును ఎత్తి 1,200 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. సమ్మక్క సాగర్ ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 6.94 టీఎమ్సీలు కాగా ప్రస్తుతం 3.88 టీఎమ్సీల నీళ్లు నిల్వ ఉన్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో పూర్తి స్థాయి నీటిమట్టం నిల్వ చేస్తే ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలో కొంత భూభాగం ముంపునకు గురవుతోందని అక్కడి ప్రభుత్వం నుంచి ఎన్‌వోసీ రాక పోవడంతో బ్యారేజీలో పూర్తి స్థాయి సామర్థ్యంతో నీళ్ల నిల్వ చేయటం లేదు. దేవాదుల ఇన్‌టేక్‌వెల్ వద్ద 79.40 మీటర్లు నీటిమట్టం నమోదు కాగా, సమ్మక్క సాగర్ వద్ద 79.60 మీటర్లు రికార్డు అయ్యిందని సీఏడీ డీఈఈ శరత్ బాబు తెలిపారు.

మీసేవా కేంద్రం తనిఖీ

చిట్యాల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని మీసేవా సెంటర్‌ను జిల్లా ఈడీఎం శ్రీకాంత్ గురువారం తనిఖీ చేశారు. కేంద్రాల్లో ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. మీసేవా కేంద్రాల్లో అందించు సేవలకు సంబంధించిన ధరల పట్టికను ప్రదర్శించాలని నిర్వహకులకు సూచించారు. అంతరాయం లేకుండా ప్రజలకు సేవలు అందించాలని, ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రుసుములు తీసుకోవాలని ఆదేశించారు.

రుణం చెల్లించని రైతు భూమికి వేలం

రేగొండ, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి) : సకాలంలో రుణం చెల్లించని రైతు భూమిని మార్చ్ 18న వేలం వేయనున్నట్లు పరకాల డీసీసీసీబీ బ్యాంకు మేనేజర్ శ్వేత గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కొత్తపల్లిగోరి మండలంలోని చిన్నకోడెపాక గ్రామానికి చెం దిన తొట్ల రాజయ్య 2020లో రూ.4 లక్షల 69 వేలకు భూమిని తనఖా పెట్టి రుణం తీసుకున్నారని పేర్కొన్నారు. ఆరు నెలలకోసారి చెల్లించాల్సిన బకాయిలు గత ఆరేళ్లుగా పెండింగ్‌లో ఉంచారని తెలిపారు. సహకార చట్టం 1964ను అనుసరించి మార్చ్ 18న వేలం వేయనున్నట్లు తెలిపారు. దీని నోటీసులు కూడా జారీ చేశామని పేర్కొన్నారు.

యూరియా దొరక్క రైతుల ఇబ్బందులు



యూరియా కోసం రైతుల పడిగాపులు

మల్హర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండలంలో యూరియాకు కృత్రిమ కొరత ఏర్పడంతో చిన్న, సన్నకారు రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో పంటకు యూరియా అందించకపోతే దిగుబడి తగ్గే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటంతో పీఏసీఎస్ ద్వారా యూరియా అమ్మకం చేపడుతున్న రైతులకు అందడం లేదు. దీంతో యూరియాను బయటకు తరలిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. లారీ లోడ్ రావడమే ఆలస్యం నాలుగు గంటల్లోనే ఖాళీ అవుతోంది. గడిచిన మూడు నెలల నుంచి పీఏసీఎస్ ద్వారా 300 టన్నుల యూరియాను విక్రయించినట్లు అధికారులు తెలుపుతున్నారు. డిమాండ్ ఎక్కువగా ఉండటం వల్ల ఈ పరిస్థితి ఉందని, శుక్రవారం నుంచి ప్రతి రెండు రోజులకోసారి యూరియా లోడ్ వస్తుందని పీఏసీఎస్ అధికారులు తెలుపుతున్నారు. ప్రతి రైతుకూ యూరియా అందే విధంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. యూరియా బయటకు తరలుతోందనే ఆరోపణ సరికాదని స్పష్టం చేశారు. .

బహుజనులంతా ఏకం కావాలి : బీఎస్పీ

టేకుమట్ల, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): రాజ్యాధికారం కోసం బహుజనలంతా ఏకం కావాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు పొన్నం భిక్షపతి గౌడ్ పేర్కొన్నారు. ఈమేరకు ఆయన గురువారం ప్రకటన వెలువరించారు. అగ్రవర్ణ నాయకులు బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకుల మధ్య చిచ్చుపెట్టి ఐకత్యను దెబ్బదీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. అగ్రవర్ణ నాయకులు వివిధ పార్టీల్లో కొనసాగుతున్న బహుజన నాయకులు మధ్య గొడవలు సృష్టి వైరుధ్యాలు రాజేస్తున్నారని ఆరోపించారు. బహుజన నాయకులంతా ఐక్యమై రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బహుజన బిడ్డలను గెలిపించాలని కోరారు.

నేటి నుంచి ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో టాలెంట్ టెస్ట్

కాటారం, ఫిబ్రవరి 20(ఆంధ్రజ్యోతి): ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్ర, శనివారాల్లో పదో తరగతి విద్యార్థులకు టాలెంట్ టెస్ట్‌ను నిర్వహించనున్నారు. పదో తరగతి వార్షిక పరీక్షలు రాసే విద్యార్థులకు పరీక్షలపై అవగాహన కల్పించడం కోసం టాలెంట్ టెస్ట్ నిర్వహిస్తున్నట్లు ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు స్మరణ్, మండల అధ్యక్షుడు సాగర్ తెలిపారు. సంవత్సరం పాటు చదివిన పాఠ్యాంశాలను పరీక్షించుకోవడానికి చేపడుతున్న అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

వేసవిలో తాగునీటి ఎద్దడిని నివారించాలి


కలెక్టరేట్‌లో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

ములుగు కలెక్టరేట్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రానున్న వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత అధికారులతో గురువారం ఆయన సమావేశమయ్యారు. వేసవిలో నీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని, ప్రజలకు తాగునీటి కొరత లేకుండా ప్రత్యేక కార్యాచరణను రూపొందించాలని అన్నారు. మిషన్ భగీరథ ద్వారా తాగునీటి సరఫరాను నిరంతరం కొనసా గించేం దుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలో ఉండే పైపులైన్లు, బోర్ల పనితీరును పరిశీలించి ఎక్కడైనా పైపులైన్ల లీకేజీ ఉంటే వాటికి మరమ్మతు పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి గ్రామంలో నీటివనరుల స్థితిగతులను పర్యవేక్షించేందుకు స్థానిక అధికారులను బాధ్యత గల వ్యక్తులుగా నియమించాలని, నీటి సరఫరా విషయంలో ఎలాంటి సమస్య ఏర్పడకుండా చూడాలన్నారు. గత ఏడాది జిల్లాలో ఎక్కడెక్కడ నీటి సమస్యలు తలెత్తాయో ఆయా ప్రాంతాల్లో ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని సూచించారు. ఈఏడాది వేసవి ముగిసే వరకు ఏదైనా నివాస ప్రాంతంలో నీటి ఎద్దడి ఏర్పడే అవకాశాలు ఉన్నట్లు గమనించిన వెంటనే ముందస్తుగానే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలన్నారు. ఎక్కడైనా నీటి సమస్య ఏర్పడితే గ్రామపంచాయతీలకు చెందిన ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా ఏర్పాట్లు చేయాలని, అవసరమైతే పక్క జీపీకి చెందిన ట్యాంకర్లను వినియోగించుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సంపత్‌రావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ మల్లేశం, ఈఈ సుభాష్, డీపీవో దేవరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈలు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు నాణ్యమైన విద్య అందించాలి

వెంకటాపూర్ (ఆంధ్రజ్యోతి): విద్యార్థినులకు నాణ్యమైన విద్య, భోజనాన్ని అందించాలని కలెక్టర్ టీఎస్.దివాకర సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన మండలంలోని రామాంజాపూర్ ప్రభుత్వ ఆశ్రమ బాలికల ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా సందర్శించారు. ముందుగా డైనింగ్‌హాల్, పడకగదులు, పరిసరాలు, స్టోర్స్, వంటగదులను పరిశీలించారు. విద్యార్థినులతో ముచ్చటిస్తూ మెనూ ప్రకారం భోజనాన్ని నాణ్యతతో రుచికరంగా అందిస్తున్నారా, విద్యాబోధన బాగుంటుందా? అని తెలుసుకున్నారు. పిల్లలకు రుచికరమైన ఆహారాన్ని అందించాలని, ఆహారం వండే సిబ్బంది పరిశుభ్రత పాటించాలని, చేతులు కడుక్కొని ఆహార పదార్థాలను సిద్ధం చేయాలని సూచించారు.

వర్షాకాలంలోపే ఇసుక డంపింగ్ పూర్తి చేయాలి

(5వ పేజీ తరువాయి)

ఇసుక క్వాంటిటీ ఉండే స్టాక్ యార్డులన్నింటినీ కలిపి పెద్ద స్టాక్ యార్డులుగా ఏర్పాటు చేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని సంబధిత అధికారులను ఆదేశించినట్లు తెలిసింది. మండలంలో ప్రతిరోజు సుమారుగా 50వేల క్యూబిక్ మీటర్ల ఇసుక అందుబాటులో ఉండేలా చూడాలని అన్నారు. దీంతో పాటు మండల వ్యాప్తంగా ఎన్ని క్వారీలు ఉన్నాయి.. క్వారీల్లో ఉన్న నిల్వ, డంప్ చేయాల్సిన ఇసుక వివరాలపై ఆరాతీశారు. బొమ్మాపూర్, ఎల్కేశ్వరం స్టాకుయార్డుతో పాటు ఆక్వారీల సమీపంలో గోదావరి నదిలో ఉన్న ఇసుక నిల్వలను పరిశీలించారు. అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టి ప్రభుత్వ ఆదాయం పెరిగేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ప్రతి లారీ వెయిట్ చెక్ చేసాకే పంపించాలని, నిబంధనలు అతిక్రమించి ప్రభుత్వ ఆదాయానికి గండికొడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. స్టాక్ పాయింట్, రీచ్‌లకు వచ్చే వాహనాలు, లోడింగ్‌తో వెళ్లే మార్గాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయడం ద్వారా పటిష్ఠ పర్యవేక్షణ ఉంటుందన్నారు. ఇసుక రవాణాను 8 నుంచి 10 వేల మెట్రిక్ టన్నులకు పెంచాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ రాహుల్‌శర్మ మాట్లాడుతూ ఇసుక రవాణా, లభ్యతపై పటిష్ఠ నిఘా ఉంచామన్నారు. అక్రమ రవాణాను అరిక ట్టేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీజీ ఎంఐడీసీ వీసీ అండ్ ఎండీ సుశీల్‌కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, మహదేవపూర్ తహసీల్దార్‌ప్రహ్లాద్ రాథోడ్, నాయబ్ తహసీల్దార్ కృష్ణ ఉన్నారు.

ట్రాఫిక్ జామ్ అయితున్నది

బొమ్మాపూర్, ఎల్కేశ్వరం క్వారీలతో పాటు ఇతర క్వారీలకు వెళ్లే లారీలన్నీ ఎల్‌అండ్‌టీ రోడ్డుపైనే పార్కింగ్ చేస్తుండటంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందని పలువురు మిర్చి రైతులు ప్రిన్సిపల్ సెక్రటరీ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన సానుకూలంగా స్పందించారు. గతంలో కుదురుపల్లి వద్ద ఏర్పాటు చేసిన పార్కింగ్ పాయింట్‌ను పరిశీలించి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. ప్రతి లారీ పార్కింగ్ పాయింట్‌కు వెళ్లి తర్వాత టోకెన్ పద్ధతిలో మాత్రమే స్టాకుయార్డులోకి అనుమతించేలా ఏర్పాటు చేయాలని సూచించారు.

అయోమయంలో కాంట్రాక్టర్లు

ఒకవైపు మైనింగ్ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు, మరోవైపు పోలీసుల ముమ్మర తనిఖీలు కాంట్రాక్టర్లను కలవరపెడుతున్నాయి. ఈ పరిణామాలతో ఇటు ఇసుక తరలించలేక, బిల్లులు రాక అయోమయానికి గురవుతున్నారు. జూన్‌లోగా డంపింగ్ ఉండకుండా ఇసుక తరలించాలనే మైనింగ్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ఆదేశాలు పాటించాలా, వాహనాల తనిఖీ చేసే పోలీసుల మాటలు వినాలా? అర్థం కాక తలలు పట్టుకుంటున్నారు.

మహాశివరాత్రి ఉత్సవాలు విజయవంతం చేయాలి

వెంకటాపూర్, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి): యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయంలో నిర్వ హించే మహాశివరాత్రి ఉత్సవాలను విజయవంతం చేయడంలో మండలస్థాయి అధికారులు పాలుపంచుకో వాలని ములుగు జిల్లా పంచాయతీ అధికారి ఒంటే రు దేవరాజ్ అన్నారు. మండలంలోని పాలంపేటలో ఉన్న రామప్ప దేవాలయ పరిసర ప్రాంతాలను తహసీల్దార్ గిరిబాబు, ఎంపీడీవో రాజు, ఎస్సై సతీష్‌లతో కలిసి డీపీవో గురువారం కలిసి సందర్శించారు. మహాశివరాత్రి ఏర్పాట్లను పరిశీలించారు. ఈసందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ రామప్ప మహాశివరాత్రి జాతర నిర్వహణలో మండల స్థాయి అధికారులు పాలుపంచుకుని విజయవంతం చేయాలని అన్నారు. పారిశుధ్యం, పార్కింగ్, దేవాలయం సమీపంలో వసతి సౌకర్యం, తాగునీటి సరఫరా, విద్యుత్, హెల్త్ క్యాంపులు, ఫైరింజన్, 108 వాహనాలు, హెల్ప్‌లైన్ సెంటర్లు, సాంస్కృతిక కార్యక్ర మాల విషయంలో తగిన చర్యలు తీసు కోవాలని ఆదేశించారు. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. మహాశివరాత్రి సందర్భంగా జాతరకు వచ్చే భక్తులసంఖ్యను దృష్టిలో పెట్టుకుని భద్రత చర్యలు తీసుకుంటామని వివరించారు. రామప్ప దేవాలయ తూర్పు ముఖద్వారంతోపాటు పడమర ద్వారం వైపు ఉన్న పిచ్చిమొక్కలను తొల గించి డోజర్లతో చదును చేయించాలని ఆయన పంచాయతీ కార్యదర్శులను ఆదేశిం చారు. ముఖ్యంగా తాగునీరు, పార్కింగ్ స్థలా ల్లో ఇబ్బందులు ఎదురుకాకుండా చూడాల న్నారు. ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు ఏర్పాటు చేయాలని, వైద్యసిబ్బంది ప్రతిరోజు శిబి రాలు ఏర్పాటు చేయాలన్నారు. విద్యుత్ సరఫరా విషయంలో ఎలాంటి అవాంతరాలు ఏర్పడకుండా మూడురోజులపాటు నిరంతరం విద్యుత్ సరఫరా చేయాలని సంబంధిత అధికారులను కోరారు. ఆయనవెంట ఎంపీవో శ్రీనివాస్, పంచాయతీ కార్యదర్శులు దామోదర్, రేవతి, రెవెన్యూ, పంచాయతీ, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

క్రైం కార్నర్

చికిత్స పొందుతూ వృద్ధురాలి మృతి



తాడ్వాయి, ఫిబ్రవరి 20 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రెండు నెలల క్రితం రోడ్డు పక్కన అనారోగ్యంతో బాధప డుతున్న గుర్తు తెలియని వృద్ధురాలిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ ఆమె గురువారం మృతి చెందిందని ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. వృద్ధు రాలి వివరాలు తెలిసిన వారు వెంటనే తాడ్వాయి పోలీ సులను ఫోన్ నంబర్ 8712670088కు కాల్ చేయాలని కోరారు.

పలువురికి గాయాలు

కాటారం (ఆంధ్రజ్యోతి) : జాతీయ రహదారి 353(సీ)పై కమలాపూర్ క్రాస్ సమీపంలో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో కాటారం గ్రామానికి చెందిన బెడికె బుచ్చిమల్లు, బెడికె మల్లయ్యతో పాటు మరో మహిళ గాయపడింది. భూపాలపల్లి నుంచి గోదావరిఖని డిపో ఆర్టీసీ బస్సు కాటారం వైపు వెళ్తుండగా మహదేవపూర్ నుంచి భూపాలపల్లి వైపు వెళ్తున్న లారీ పక్క నుంచి తాకుకుంటూ వెళ్లడంతో సీట్లో కూర్చున్న బుచ్చిమల్లు, మల్లయ్యతో పాటు మరో ఇద్దరికి గాయాలయ్యాయి. క్షతగాత్రులను అంబులెన్స్‌లో భూపాలపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. పోలీ సులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు తెలుసుకున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


శివకుమార్ (ఫైల్)

మంగపేట (ఆంధ్రజ్యోతి) : మండలంలోని బోరునర్సాపురం శివారులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ముగ్గురు యువకుల్లో ఒకరు చికిత్స పొందుతూ మృతి చెందిన సంఘటన గురువారం చోటు చేసుకుంది. చెరుపల్లికి చెందిన బంటు భాను చందర్, మంగపేట పొద్మూరు కాలనీకి చెందిన బేత సాయి కుమార్, చెరుపల్లికి చెందిన గుండారాపు శివకుమార్ (19) తీవ్రంగా గాయ పడగా స్థానికులు హుటాహుటిన వరంగల్ ఎంజీ ఎం ఆస్పత్రికి తరలించారు. శివకుమార్ పరిస్థితి విషమంగా ఉండటంతో అక్కడి వైద్యులు హైదరాబాద్‌లోని గాంధీ హాస్పిటల్‌కు రిఫర్ చేశారు. చికిత్స అందిస్తున్న క్రమంలో శివకు మార్ మృతి చెందాడు. మృతుడికి తండ్రి నర్సింహరావు, తల్లి సాంబలక్ష్మి, తమ్ముడు రాజు ఉన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్



నడిరోడ్డుపై విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. భూపాల పల్లి నుంచి జంగేడుకు వెళ్లే ప్రధాన రహదారిలో ఈ ట్రాన్స్‌ఫార్మర్ కాకతీ యకాలనీ సమీపంలో ఉంది. ఈ ట్రాన్స్‌ఫార్మర్ పూర్తిగా రోడ్డుకు మధ్య లోకి వచ్చింది. నిత్యం ఈ రోడ్డు వెంట స్కూల్ బస్సులు, ఆటోలు, ఇతర వాహనాలు రాకపోకలు సాగిస్తుం టాయి. ప్రమాదాలు జరగకముందే ఈ ట్రాన్స్‌ఫార్మర్‌ను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, భూపాలపల్లి